ప్రజాశక్తి
శనివారం 2 డిసెంబర్ 2023 8 పేజీలు
ప్రకాశం బాపట్ల







మాట్లాడుతున్న రమాదేవి

'జగనన్నకు చెబుదాం' వృథానే..

- ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం..
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు డి.రమాదేవి

ప్రజాశక్తి-బాపట్ల

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జగనన్నకు చెబుదాం' వృథా కార్యక్రమమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.రమాదేవి అన్నారు. శుక్రవారం పార్టీ బాపట్ల జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు టి. కష్ణమోహన్ అధ్యక్షతన జరిగిన సిపిఎం జిల్లా కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజలు పెట్టుకున్న అర్జీలు ఆన్‌లైన్లో నమోదు చేస్తున్నారని, అయితే ప్రజల సమస్య పరిష్కారం కాకుండానే సమస్య పరిష్కారం అయినట్టు మెసేజ్‌లు రావడం దారుణమన్నారు. అన్యాక్రాంతమైన పేదల భూముల సమస్యలు, పెన్షన్లపై దష్టి పెట్టలేదన్నారు. ప్రజలు వ్యయ ప్రయాసలకు గురికావడం, అధికారుల సమయం వృథా తప్ప సమస్యలు పరిష్కారమైన దాఖలాలు లేవన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వృత్తిదారులు, మహిళల పెన్షన్‌కు సంబంధించి కుదించిన వాటిని వెంటనే పునరుద్ధరణ చేయాలని అన్నారు. బాపట్ల జిల్లాలో అద్దంకి, పర్చూరు నియోజకవర్గాల్లో నీరు లేక పంటలు ఎండిపోయాయన్నారు. ఆయా మండలాలను కరువు మండలాలుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కరెంట్ స్మార్ట్ మీటర్ల ఏర్పాట్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆపివేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాన్ని వ్యతిరేకించాలన్నారు. వైసిపి, టిడిపిలు బిజెపిని వ్యతిరేకించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్. గంగయ్య, జిల్లా నాయకులు సిహెచ్ మజుందార్, మణిలాల్, వినోద్, బాబురావు, పాల్గొన్నారు.

వెంటాడుతున్న వర్షాభావం

- రబీలో ముందుకు సాగని పంటల సాగు
- ఆరుతడి పంటలకూ నీటి సమస్య జఠిలం
- ఇప్పటివరకూ 32.67 శాతం విస్తీర్ణంలోనే పైర్లు
- కరువు సహాయకచర్యలపై రాష్ట్ర ప్రభుత్వం మౌనం

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

ఖరీఫ్ కరువుకు బలైపోయింది. పంటల సాగు పూర్తిగా చేజారింది. కారణం వర్షాభావమే. సకాలంలో వర్షాలు కురవలేదు. మరోవైపు సాగర్ రిజర్వాయర్ కూడా ఎండిపోయింది. సాగునీరు కూడా లేదు. భూగర్భ జలాలు అడుగంటాయి. బోర్లు ఎండిపోయాయి. ఎక్కడా నీటిచుక్కలేదు.అరకొరగా కురిసిన వర్షాలకు సాగుచేసిన పంటలు ఎదుగుదలకు అవసరమైన నీరు లేక ఎండుముఖం పట్టాయి.ఖరీఫ్ పంటలు 80శాతంపైగా దెబ్బతిన్నాయి.వాటిపై రైతులు ఆశలు వదులుకున్నారు. ఇపుడూ వర్షాభావం వెంటాడుతోంది. రబీని కబళించేలా కనిపిస్తోంది.



గుండ్లాపల్లి వద్ద సాగునీరు లేక ఎండిపోతున్న మిర్చి పంట

అదును దాటినా వర్షాలు లేవు. నవంబరులో కురిసిన వర్షాలకు పొగాకు నాట్లు వేశారు. ఇపుడు మొక్కలు పెరుగుతున్నాయి. వీటికి నీళ్లు కావాలి. ఆరుతడి వేస్తేనే తోటలు పెరుగుతాయి.జనవరిలో పొగాకు కొట్టుడుకు వస్తుంది. అంటే నవంబరులోనే నాట్లు పూర్తికావాల్సి ఉండగా ఇప్పటి వరకూ 50శాతం విస్తీర్ణంలో కూడా నాట్లు పడలేదు. మిగతా పంటలకూ నీటి సమస్య తీవ్రంగా ఉంది. మిర్చి,పత్తి వంటి పంటలు సాగుచేసిన రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎక్కడా నీళ్లు లేవు. కాలువల్లోనూ అదే పరిస్థితి. వర్షాలు లేక కుంటలు ఎండిపోయాయి. చెరువుల్లోనూ నీళ్లు లేవు. తాగునీటి కోసమే కొన్ని చెరువులను సాగర్ నీటితో ఇటీవలే నింపారు.వాటిని తాగునీటికోసం వాడుతున్నారు. పంటలకు అనుమతి లేదు. ప్రస్తుతం రబీ కూడా ముందుకు సాగడం లేదు. ప్రస్తుతం 32.67 శాతం విస్తీర్ణంలో వివిధ పైర్లు వేశారు.అవి కూడా ఇంకా సాగుకావాల్సిన పైర్లు పరిస్థితి ప్రశ్నార్థకమైంది.రబీలో అన్ని పంటలు సాధారణ విస్తీర్ణం 1,72,909 హెక్టార్లు ఉండగా ఇప్పటి వరకూ 56,491 హెక్టార్లలో వివిధ పంటలు సాగుచేశారు. ఇదే సమయానికి గతేడాది 66,362 హెక్టార్లలో పంటలు వేశారు.ఈఏడాది సాగు ముందుకు సాగలేదు. ఆశాజనకంగానూ లేదు.వర్షాలు చూస్తే అక్టోబరులో 205.1మిమి కురవాల్సి ఉండగా కేవలం 12.1 మిమి కురిసింది. అంటే 94.1శాతం లోటు ఉంది.అంటే అక్టోబరులో రబీ ప్రారంభమవుతుంది.ఆ నెలలోనే వర్షాలు లేవు.నవంబరులో సాధారణ వర్షపాతం 136.2మిమి కురవాల్సి ఉండగా ఈ మేరకు కురిసింది.నవంబరులో ఈ మాత్రం వర్షాలు కురవడంతోనే కొంత మేరకైనా సాగు జరిగింది.లేకుంటే రబీపై పూర్తిగా ఆశలు వదులకోవాల్సి వచ్చేంది. బంగాళాఖాతంలో ఏర్పడినఅల్పపీడనాలు కొంత గట్టెక్కించాయి. ఓ మోస్తారు వర్షాలు కురిశాయి. రైతులు కొంత ఊపిరి పీల్చుకున్నారు. డిశంబరులోనూ వర్షాలపై ఆశలు కనిపిస్తున్నాయి. అల్పపీడనాలు ఏర్పడితే తప్ప వర్షా లు కురిసే పరిస్థితి మాత్రం కనిపించడం లేదు. ఇక ఖరీఫ్, రబీ రెండు సీజన్లలోనూ కరువు కొనసాగుతోంది. ▶ 2లో

మీ కూతురు స్పృహ కోల్పోయింది..

అత్యాచారం చేసి.. బాలిక తల్లికి ఫోన్ చేసిన నిందితులు

ప్రజాశక్తి-శింగరాయకొండ

మండలంలోని బింగినపల్లిలో గిరిజన బాలికపై సామూహిక అత్యాచారానికి పాల్పడిన ముగ్గురు నిందితులు.. అత్యాచారం అనంతరం గురువారం రాత్రి సమయంలో హైదరాబాదులో ఉన్న బాలిక తల్లికి ఫోన్ చేశారు. మీ కుమార్తెపై అఘాయిత్యం చేశామని, స్పృహ కోల్పోయిందని, కొత్త సచివాలయాల నిర్మాణం దగ్గర డంపింగ్ యార్డులో ఉందని చెప్పారు. ఆమె వెంటనే గిరిజన కాలనీలో ఉన్న వారి కుటుంబసభ్యులకు విషయం ఫోన్ చేసి చెప్పింది. దీంతో కుటుంబసభ్యులు ఘటనాస్థలానికి వచ్చి.. బాలికను ఇంటికి తీసుకెళ్లారు.

గ్యాంగ్‌రేప్ బాధితురాలికి ఎస్‌పి ఫోన్

బింగినపల్లిలో సామూహిక అత్యాచారానికి గురైన బాలికను ఎస్‌పి మల్లికగర్గ్ ఫోన్‌లో పరామర్శించారు. డిఎస్‌పి వి.నారాయణ స్వామిరెడ్డి శుక్రవారం రాత్రి శింగరాయకొండ వచ్చి.. సిఐ రంగనాథ్‌తో మాట్లాడారు. బాలికతో మాట్లాడి.. వివరాలు తెలుసుకున్నారు.

ఏసీబీ వలలో ఇద్దరు వీఆర్వోలు

- రూ.20 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డ వైనం

ప్రజాశక్తి-చీమకుర్తి

చీమకుర్తి మండలానికి చెందిన ఇద్దరు విఆర్ఒలు రూ.20 వేలు లంచం తీసుకుంటూ.. ఏసీబీకి పట్టుబడ్డ ఘటన శుక్రవారం జరిగింది. ఏసీబీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చంద్రపాడుకు చెందిన పోటు శ్రీనివాసరావు, ఆయన తల్లి పోటు వరలక్ష్మి, పోటు అంకమ్మరావు వారి ఆస్తుల పంపకం విషయంలో చంద్రపాడు ఇన్‌ఛార్జి విఆర్ఒ మారెళ్ల వెంకట వీరనారాయణను కలిశారు. వీరనారాయణ వారి వద్ద నుంచి స్టేట్‌మెంట్ తీసుకున్నారు. గత నెల 28న వీరనారాయణ వారికి ఫోన్ చేసి తనను కలవాలని చెప్పాడు. కోటు శ్రీనివాసరావు కలిశాక పనిచేసి పెడితే రూ.30 వేలు ఇవ్వాలని వీరనారాయణ అడిగాడు. చివరికి రూ.20 వేలు ఇచ్చే విధంగా బేరం కుదిరింది. లంచం ఇవ్వడం ఇష్టం లేని పోటు శ్రీనివాసరావు గత నెల 29న ఏసీబీ అధికారులను కలిసి ఫిర్యాదు చేశాడు. మారెళ్ళ వీరనారాయణ పోటు శ్రీనివాసరావుకు ఫోను చేసి లంచం డబ్బులు రూ.20 వేలు చీమకుర్తి-4లోని విఆర్ఒ సౌజన్యకు ఇవ్వాలని చెప్పాడు. ఏసిబి అధికారులు రెండు బృందాలుగా ఏర్పడి ఒక బృందం పల్లామల్లి విఆర్ఓ వీరనారాయణ వద్దకు, రెండో బృందం చీమకుర్తిలోని సౌజన్య వద్దకు వెళ్లారు. బాధితులు పోటు శ్రీనివాసరావు వద్ద నుంచి రూ.20 వేలు లంచం తీసుకుంటున్న విఆర్ఒ సౌజన్యను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. పల్లామల్లిలో విఆర్ఒ వీరనారాయణను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఏసీబీ డిఎస్పీ వల్లూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విఆర్ఒలను అదుపులోకి తీసుకోవడం జరిగిందన్నారు. వీరనారాయణను శుక్రవారం అరెస్టు చేశామని, సౌజన్యను శనివారం అరెస్టు చేసి.. నెల్లూరు కోర్టులో హాజరు పరచనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏసిబి సిఐలు ఎన్‌విఎస్ అపర్ణ, టివి శ్రీనివాసరావు, సిహెచ్ శేషు, సిబ్బంది పాల్గొన్నారు.



లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డ విఆర్ఒలు

తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు సిద్ధమవ్వాలి

- '1077' కాల్ సెంటర్‌ను అందుబాటులోకి తేవాలి
- అధికారులకు కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

మిచౌంగ్ తుఫాను ప్రభావం జిల్లాపై ఉంటుందనే ప్రాథమిక అంచనాల దృష్ట్యా ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం మొత్తం సిద్ధంగా ఉండాలని కలెక్టర్ ఏఎస్.దినేష్‌కుమార్ ఆదేశించారు. ఈ అంశంపై శుక్రవారం సాయంత్రం ఆయన సంబంధిత శాఖల అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ, ఉద్యానవన అధికారులు తుఫాన్‌పై రైతులకు తెలియజేసి పంటలను జాగ్రత్త చేసుకునేలా అవగాహన కల్పించాలని ఆదేశించారు. జాలర్లు చేపల వేటకు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని మత్స్యశాఖ అధికారులకు స్పష్టం చేశారు. గర్భిణులు, వృద్ధులు, చిన్నపిల్లల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, తీర ప్రాంత గ్రామాలలోని తుఫాను షెల్టర్ కేంద్రాలను నిర్వహణలోకి తీసుకువచ్చేలా శనివారం ఉదయం నుంచే చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు. గ్రామ, మండల స్థాయిలోని వైద్య సిబ్బందిని అప్రమత్తం చేయాలని, ఎలాంటి ప్రాణ నష్టం, పశు నష్టం జరగకుండా చూడాలని స్పష్టం చేశారు. అవసరమైన మందులను ముందుగానే సిద్ధం చేసుకోవాలన్నారు. విద్యుత్, రవాణా వ్యవస్థకు ఇబ్బంది లేకుండా ముందుగానే చర్యలు చేపట్టాలని, లోతట్టు ప్రాంతాలలో నీరు నిలువకుండా పారిశుధ్య కార్మికులను అప్రమత్తం చేయాలని సంబంధిత శాఖలకు దిశా నిర్దేశం చేశారు. జిల్లా కేంద్రంలోనూ, మండల కేంద్రాల్లోనూ కమాండ్ కంట్రోల్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. కమ్యూనికేషన్ వ్యవస్థకు ఎలాంటి అంతరాయం లేకుండా నెట్‌వర్క్ ఆపరేటర్లతో శనివారం ఉదయమే ప్రత్యేక సమావేశం ▶ 2లో



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

వెంటాడుతున్న వర్షాభావం

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎటువంటి చర్యలు లేవు. కరువు జిల్లాల ప్రకటన లేదు. అన్ని మండలాల్లోనూ కరువు ఉంది.పశ్చిమాన పరిస్థితులు మరింత ప్రమాదంగా మారాయని శాస్త్రవేత్తలు హెచ్చరించారు.పలు మండలాల్లో భూగర్జజలాలు,పంటలు, వర్షాలు,సాగునీటి వనరులపై అధ్యయనం చేశారు. వైపాలెం, గిద్దలూరు, మార్కాపురం మండలాల్లో పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారింది.కనిగిరి నియోజకవర్గంలోనూ ఇదే పరిస్థితి. సాగర్ ఆయకట్టు ఉన్న దర్శి, సంతనూతలపాడు, అద్దంకి నియోజకవర్గాల్లో నీళ్లు లేనందున అక్కడా పంటలకు గడ్డు పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇపుడు పత్తి, మిర్చి వంటివి కేవలం బోర్లు అందుబాటులో ఉన్నచోట్లే వేశారు. మిగతా ప్రాంతాల్లో మిర్చితోటలు ఎండుముఖం పట్టాయి.కరువు సహాయక చర్యలు లేవు. జిల్లా అధికారులు ఇక్కడ పరిస్థితులపై రాష్ట్ర ప్రభుత్వానికి కూడా నివేదించారు.వాటిని పక్కనబెట్టేశారు.కరువుపై జిల్లా మంత్రి కనీసం సమీక్ష కూడా చేయలేదు. ప్రజాప్రతినిధులకు పట్టడం లేదు.అందరూ ఎన్నికల వ్యూహాల్లోనే ఉన్నారు. పంటలు,రైతులు గురించి ఆలోచించేనాధుడే కనిపించడం లేదు. జిల్లాలోని అన్ని మండలాలను కరువు కింద గుర్తించాలని సిపిఎం జిల్లా కమిటీ డిమాండు చేసింది. రైతుసంఘాలు కూడా కరువు సహాయకచర్యలు చేపట్టాలని కోరుతున్నాయి. ఇతర పార్టీలకు కరువు ఏమాత్రం పట్టడం లేదు.

తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు సిద్ధమవ్వాలి

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహించాలని ఒంగోలు ఆర్డీవోను ఆదేశించారు. ఉద్యోగులెవరికీ సెలవులు ఇవ్వరాదన్నారు. జిల్లాస్థాయిలో 1077 కాల్ సెంటర్‌ను శనివారం ఉదయం నుంచే అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్ కార్యాలయ అధికారులను ఆయన ఆదేశించారు. ఇతర శాఖలు కూడా అవసరమైన కార్యాచరణ ప్రణాళికతో సిద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు. టెలికాన్ఫరెన్స్‌లో జెసి కె.శ్రీనివాసులు, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, జిల్లా ఉద్యాన అధికారి గోపీచంద్, మత్స్యశాఖ జెడి చంద్రశేఖర్‌రెడ్డి, డిఎంహెచ్‌ఒ రాజ్యలక్ష్మి, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి బేబీరాణి, ఆర్.అండ్.బి. ఎస్‌ఈ. దేవానందం, పంచాయతీరాజ్ ఎస్‌ఈ కొండయ్య, ఎపిసిపిడిసిఎల్ ఎస్‌ఈ కెజివి సత్యనారాయణ, ఒంగోలు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, కలెక్టర్ కార్యాలయంలోని వివిధ సెక్షన్ల సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనలు

ప్రజాశక్తి-మార్కాపురం

టాటా కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో మార్కాపురం పట్టణానికి చెందిన శ్రీసాయి బాలాజీ హైస్కూల్ విద్యార్థులు సత్తాచాటారు. 'పర్యావరణంపై అవగాహన' అనే అంశం నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో సాయి బాలాజీ హైస్కూల్ విద్యార్థులు షేక్ సహానా, ఎం.అనూష, డి.సమీర, సీనియర్స్‌లో కె.చైతన్య, షేక్ అస్లాం అబిద్ అరి, ఎం.లాస్యప్రియ విజేతలుగా నిలిచారు. విజేతలకు పాఠశాలలో శుక్రవారం అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ అండ్ ప్రిన్సిపల్ పెరుమాళ్ల ప్రకాశరావు, ప్రిన్సిపల్ సయ్యద్ మస్తాన్‌వలి, ఉపాధ్యాయులు విజేతలను అభినందించారు.

పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

ప్రజాశక్తి - కనిగిరి

కార్తీక మాసం సందర్భంగా పుణ్యక్షేత్రాలకు కనిగిరి డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ బి. శ్రీమన్నారాయణ తెలిపారు. శైవ క్షేత్రాలైన పంచారామాలు, అరుణాచలం, శ్రీశైలం, శబరిమలై తదితర ప్రాంతాలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు పేర్కొన్నారు. శ్రీశైలానికి ప్రతి ఆది, సోమవారాలు, ప్రతి సోమవారం భైరవకోనకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రజలు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. .

మహిళలపై దాడులను అరికట్టాలి : ఐద్వా

ప్రజాశక్తి - కనిగిరి

మహిళలపై జరిగే హింసకు వ్యతిరేకంగా ఈనెల 10 మానవ హక్కుల దినోత్సవం వరకూ హింసా వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టనున్న ఐద్వా నాయకులు తెలిపారు. స్థానిక సుందరయ్య భవన్‌లో ఐద్వా కనిగిరి పట్టణ కమిటీ సమావేశం సిహెచ్. శాంత కుమారి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఎస్‌కె. బషీరా, కె. లక్ష్మీ ప్రసన్న మాట్లాడుతూ మహిళలు, చిన్నారులపై హింస, అఘాయిత్యాలు రోజురోజూకు పెచ్చరిల్లిపోతున్నట్లు తెలిపారు. దేశంలో క్రైమ్ రేటు పెరుగుతున్నట్లు తెలిపారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత అఘాయిత్యాలు మరింత పెరిగినట్లు అనేక సర్వేల్లో తెలుస్తున్నట్లు తెలిపారు. మహిళలను వంటింటికే పరిమితం చేయాలంటున్న మనుధర్మ శాస్త్రం ఆధారంగా బిజెపి పాలన సాగించడమే అందుకు కారణమన్నారు. స్వయానా ప్రభుత్వాధినేతలే నిందితులకు అన్ని విధాలా అండగా నిలవటం సిగ్గు చేటున్నారు. రాష్ట్రంలో గడచిన నాలుగున్నర ఏళ్ల కాలంలో మద్య నిషేధం అమలు కాలేదన్నారు. మద్యంతో పాటు రాష్ట్రంలో మత్తు పదార్థాల వినియోగం పెరిగిటన్లు తెలిపారు. ఈ కారణంగానే అత్యాచారాలు, దాడులు, దౌర్జన్యాలు పెరిగిపోతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఐద్వా నాయకురాలు జి.ఆదిలక్ష్మి, ఎస్‌కె.షఫీలా ,కె.రత్తమ్మ, ఎం.వెంకటమ్మ, ఎస్‌కె. ముంతాజ్, ఎం.ఎలీశమ్మ, ఎస్.రమణమ్మ, ఎస్.రమ, షేక్ లాల్‌బి, వై.ఎలీశమ్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐద్వా నాయకురాలు బషీరా

కురిచేడుకు బస్సు సౌకర్యం

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి-కురిచేడు

గతనెల 25న ప్రజాశక్తి దినపత్రికలో ఎర్రబస్సు ఎరుగని గ్రామాలు అనే శీర్షికతో ఒకథనం ప్రచురితమైంది. ఈ కథనానికి పొదిలి ఆర్‌టిసి డిపో మేనేజర్ సుందరరావు స్పందించారు. పొదిలి నుంచి దొనకొండ, దొనకొండ నుంచి కురిచేడుకు ఉదయం 7.45 గంటలు బస్సు సౌకర్యం కల్పించారు. అదేవిధంగా సాయంత్రం 5.15 గంటలకు కురిచేడు నుంచి దొనకొండకు బస్సు సౌకర్యం ఏర్పాటు చేసినట్లు డిపోమేనేజరు తెలిపారు. రెండు మండలాల ప్రజలు ఈ బస్సు సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ బస్ సర్వీసుల వద్ద దొనకొండ నుంచి తిరుపతి వెళ్లే ప్రయాణికులకు మేలు కలుగుతుందన్నారు.

ఎయిడ్స్ నియంత్రణ సామాజిక బాధ్యత

మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్

ప్రజాశక్తి - కనిగిరి

ఎయిడ్స్ నివారణ అందరి బాధ్యత అని కనిగిరి మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ తెలిపారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ విభాగం, వైద్య, ఆరోగ్య శాఖ, కనిగిరి మండల న్యాయ సేవాధికార సంస్థ సహకారంతో ఐసిటిసి ఆధ్వర్యంలో ఎయిడ్స్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. కనిగిరి ప్రభుత్వ ఆస్పత్రి వద్ద మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌ఒ డాక్టర్ సృజన, కమ్యూనిటీ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ అబ్దుల్ కలాం ఐసిటిఎస్ కౌన్సిలర్ శ్రీనివాసరావు, ఎస్‌బిసిసి కోఆర్డినేటర్ కిరణ్ కుమార్, ప్రభుత్వ వైద్యశాల వైద్యులు డాక్టర్ ప్రియర్ష నందా, డాక్టర్ పణి, హెల్త్ సూపర్‌వైజర్లు , పారా లీగల్ వాలంటీర్లు గుడ్ హెల్ప్ ఫౌండేషన్ ప్రతినిధులు రమేష్ బాబు, ప్రేమ్ కుమార్, జిఎస్ అండ్ జిడికె ఫౌండేషన్ కోఆర్డినేటర్ నవ కుమార్ తదితరులుపాల్గొన్నారు.

కనిగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌ఛార్జి జి.రాజేంద్ర బాబు అధ్యక్షత అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ప్రోగ్రాం ఆఫీసర్ రామరాజు, అధ్యాపకులు షేక్ ఖాసింపీరా, రాజేంద్ర బాబు,వెంకటరమణ ,చెన్నకేశవులు, రవీంద్ర, హనుమంతరావు, నాగమణి ,గురవమ్మ ,సురేష్ ,రామరాజు , వెంకటరాజు , కోటి సాహెబ్ పాల్గొన్నారు.

మార్కాపురం : ఎయిడ్స్ అంటు వ్యాధి కాదని, అంటించుకొనే వ్యాధి అని మార్కాపురం ప్రభుత్వ జిల్లా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.సుబ్బారెడ్డి చెప్పారు. ప్రపంచ ఎయిడ్స్ డే సందర్భంగా హ్యాండ్సఫ్ సంస్థ ఆధ్వర్యంలో జిల్లా వైద్యశాలలో రోగులకు పండ్ల పంపిణీ చేశారు. అనంతరం హెచ్‌ఐవి బాధితులకు న్యూట్రిషన్ ఫుడ్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హ్యాండ్సఫ్ సంస్థ మేనేజర్ ఐజాక్‌బాబు, సిబ్బంది పూర్ణకంటి తిరుమలయ్య, ఎటిఆర్ సిబ్బంది పి.వెంకటేశ్వర్లు, పోతురాజు, కోర్టు సిబ్బంది వలినాథ్ పాల్గొన్నారు.

తర్లుపాడు : తర్లుపాడు మండలం కలుజువ్వలపాడు పంచాయతీ పరిధిలోని లింగారెడ్డి కాలనీ మండల ప్రాథమిక



ర్యాలీ పాల్గొన్న నాయకులు, అధికారులు, విద్యార్థులు

పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మౌలాలి ఆధ్వర్యంలో ప్రపంచ ఎయిడ్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలోఉపాధ్యాయుడు సెక్షావలి, విద్యార్థులు పాల్గొన్నారు. **టంగుటూరు :** ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా పేస్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ మల్లికార్జున రావు, ఎన్ సీసీ లెఫ్ నెంట్ పర్థీవ కష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్, ప్రిన్సిపాల్ మూర్తి, స్టూడెంట్స్ డీన్ వీరాంజనేయులు, ఎఒ రమణబాబు, కళాశాల అధ్యాపక సిబ్బంది, ఎన్‌సిసి విద్యార్థులు పాల్గొన్నారు **యర్రగొండపాలెం :** హెచ్‌ఐవి రహిత సమాజాన్ని నిర్మిద్దామని పలువురు వైద్యులు పిలుపునిచ్చారు. ప్రపంచ ఎయిడ్స్ డే సందర్భంగా ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ వి.సూర్య ప్రకాష్, డాక్టర్ వినయ్ కుమార్, డాక్టర్ దిలీప్ యాదవ్, హెడ్ నర్సు ఫ్లోరెన్‌సిస్, ఐసిటిసి ల్యాబ్ టెక్నిషియన్ శ్రీదేవి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు. ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్ పి రామకోటయ్య ఆధ్వర్యంలో పపంచ ఎయిడ్స్ డే శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీధర్ నాయుడు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి ప్రదీప్, కళాశాల అకడమిక్ అడ్వైజర్ డాక్టర్ తిరుపతయ్య, తదితరులు పాల్గొన్నారు **దర్శి :** ప్రతి ఒక్కరూ ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సావిత్రి తెలిపారు. ప్రపంచ ఎయిడే సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థు పాల్గొన్నారు.

మహారాజశ్రీ కందుకూరు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S.No.191/2011

1. **వేమూరి సుబ్బమ్మ,** & వగైరా – వాదులు

వర్సెస్

1. **దుద్దుకూరి వెంకట లక్ష్మమ్మ** & వగైరా – ప్రతివాదులు

టు,

11) **భోగినేని కాశయ్య,** S/o **రోశయ్య,** నుచ్చుపొద గ్రామం, తిరగలదిన్నె మజరా, ఇనమర్ల పోస్టు, పామూరు మండలం, ప్రకాశం జిల్లా.

పై నెంబర్ దావాలో మీరు ప్రతివాదిగా ఉన్నారు. మీరు పై కోర్టు నుండి అనేక సార్లు వాదులు నోటీసులు పంపినను మీరు తీసుకోనందున శ్రీ కోర్టు వారు ఈ నోటీసును పేపరు ప్రకటన ద్వారా మీకు తెలియచేయమని ఉత్తర్వులు వేసి, పై నెంబర్ దావాను **తేది: 06-12-2023** కి వాయిదా వేసివున్నారు. కావున ఆదినము **ఉదయం గం॥ 10-30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గానీ, లేక మీ వకీలు ద్వారా గానీ హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనియెడల శ్రీ కోర్టు వారు మీ పరోక్షమున విచారించి తీర్మానించెదరు.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది: **06-12-2023**

ఇట్లు

చిడిపోతు హరికృష్ణ

న్యాయవాది, కందుకూరు.

మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, కందుకూరు

I.A.No. 231/2022

O.S.No. 111/2012

గద్దె వెంకటేశ్వర్లు – వాది

Vs

గద్దె రవి, మరియు ఇతరులు – ప్రతివాదులు

To,

R7: **గద్దె నరసమ్మ,** భర్త **వెంకటేశ్వర్లు,** వయస్సు 70 సం॥, పామూరు గ్రామము మరియు మండలం, ప్రకాశం జిల్లా.

పై తెలిపిన పిటిషన్‌లో వాది ప్రతివాదులపై దావా దాఖలు చేయుచున్నారు. మరియు మీ హాజరు నిమిత్తమై పిటిషన్ **తేది: 11-12-2023** న వాయిదా వేసియున్నారు. కావున మీరు నేరుగా గానీ, లేదా మీ తరపు న్యాయవాది ద్వారా గానీ **తేది: 11-12-2023** న హాజరై మీ వాదనలను తెలుపుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమున కోర్టు వారు తీర్మానించెదరని తెలియజేయడమైనది.

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

వి.సులోచన

వాదితరపు న్యాయవాది, కందుకూరు,

ఫోన్: **77310 71818, 85008 54195**

మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, కందుకూరు

I.A.No. 446/2023

I.A.No. 447/2023

I.A.No. 448/2023

O.S.No. 111/2012

గద్దె వెంకటేశ్వర్లు – వాది

Vs

గద్దె రవి, మరియు ఇతరులు – ప్రతివాదులు

To,

R19: **గద్దె హర్షిత,** తండ్రి **గద్దె రవి,** వయస్సు 18 సం॥, ఆకులవీధి, పామూరు గ్రామము మరియు మండలం, ప్రకాశం జిల్లా.

పై తెలిపిన 3 ఐ.ఎ.లలో వాది మిమ్ములను ప్రతి వాదులుగా దాఖలు చేయుచున్నారు. ఎందుకంటే ఆర్1 అయిన గద్దె రవి మరణించినందున మిమ్ములను వారసులుగా చేర్చుడమైనది. మీ హాజరు నిమిత్తమై పిటిషన్ **తేది: 11-12-2023** న వాయిదా వేసియున్నారు. కావున మీరు నేరుగా గానీ, లేదా మీ తరపు న్యాయవాది ద్వారా గానీ **తేది: 11-12-2023** న హాజరై మీ వాదనలను తెలుపుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమున కోర్టు వారు తీర్మానించెదరని తెలియజేయడమైనది.

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

వి.సులోచన

వాదితరపు న్యాయవాది, కందుకూరు,

ఫోన్: **77310 71818, 85008 54195**

గుర్తుతెలియని వాహనం ఢీకొని

తల్లి,కూతురు మృతి



అక్షిత పావని, విజయకుమారి(ఫైల్)

ప్రజాశక్తి- చెరుకుపల్లి

గుర్తుతెలియని వాహనం ఢీకొన్న ఘటనలో తల్లీ,కూతురు మృతి చెందాడు. ఈఘటన మండల పరిధిలోని ఆరుంబాక గ్రామ సమీపంలో 216 జాతీయ రహదారిపై శుక్రవారం చోటు చేసుకుంది. చెరుకుపల్లి ఎస్ఐ వై.సురేష్ కథనం ప్రకారం.. ఆరుంబాక గ్రామానికి చెందిన కర్ర విజయ కుమారి (40), ఆమె కుమార్తె కర్ర అక్షిత పావని (20) ప్రార్థన కోసం సమీపంలోని చర్చికి వెళ్తున్నారు. అదే సమయంలో గుర్తుతెలియని వాహనం ఢీకొంది. దీంతో వారికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. అప్పటికే వారు మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలి భర్త కర్ర ప్రతాప్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకట రమణారావు, మోపిదేవి హరినాథ్ బాబు, రతన్‌ప్రసాద్, పైనం ఏడుకొండల రెడ్డి తదితరులు వైద్యశాలలో మృతదేహాలను సందర్శించి నివాళులర్పించారు.



నివాళులర్పిస్తున్న ఎంపీ మోపిదేవి

ప్రియురాలు దక్కదని...

మనస్తాపంతో ప్రియుడు ఆత్మహత్య



ఆత్మహత్యకు పాల్పడిన అంకమ్మ

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

ప్రియురాలు దక్కదని ప్రియుడు బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండల పరిధిలోని బొల్లాపల్లి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు, యువకుడి బంధువుల కథనం ప్రకారం... జె .పంగులూరు మండలం కొండ మంజులూరు గ్రామానికి చెందిన వల్లెపు అంకమ్మ (20) గుజరాత్ లోని ఓ యూనివర్సిటీలో బిటెక్ కంప్యూటర్ సైన్స్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. మార్టూరులో 10వ తరగతి చదివే సమయంలో బొల్లాపల్లి గ్రామానికి చెందిన ఓ యువతితో ప్రేమలో పడ్డారు. అప్పటి నుంచి ఇద్దరూ ప్రేమించుకున్నారు. ఈ క్రమంలో ఇటీవల బొల్లాపల్లిలోని ఓ గుడిలో పెళ్లి చేసుకొని యువతి ఇంటికి వెళ్లాడు. యువతి తల్లిదండ్రులు అంకమ్మను మందలించి వారి ఇంటికి పంపారు. అనంతరం తమ కుమార్తెతో మరో పెళ్లి చేసేందుకు తల్లిదండ్రులు ప్రయత్నిస్తున్నారు. దీంతో యువతి ఈ విషయం గురించి అంకమ్మకు సమాచారం అందించారు. మనస్తాపానికి గురైన అంకమ్మ బొల్లాపల్లి వెళ్లి యువతి ఇంటికి సమీపంలోనున్న బావిలో దూకాడు. బావి నుంచి పెద్ద శబ్దం రావడంతో గమనించిన స్థానికులు యువకుడిని కాపాడే ప్రయత్నం చేశారు. అప్పటికే అంకమ్మ మతి చెందాడు. సమాచారం అందుకున్న మార్టూరు ఎస్ఐ శ్రీనివాసరావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానసిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. యువకుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

'నాడు-నేడు' పనులు పూర్తి చేయాలి

ప్రజాశక్తి-సిఎస్.పురం

నాడు-నేడు పనులు త్వరిత గతిన పూర్తి చేయాలని ఎంఇఒ ప్రసాదరావు తెలిపారు. ఎంఆర్‌సి కార్యాలయంలో ప్రధానోపాధ్యాయులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ నాడు-నేడు కింద ఫేజ్- 1పేజ్ -3 ద్వారా పాఠశాలలకు మంజూరైన స్కూల్ మైంటైనెన్స్ ఫండ్‌ను ఎలా వినియోగించాలి, బిల్లులు అప్లోడ్ ఎలా చేయాలనే విషయంపై ప్రధానోపాధ్యాయులకు వివరించారు. పిల్లలు వర్క్ బుక్స్ పూర్తి చేసి లెస్సన్ ప్లాన్స్ ఏవిధంగా తయారు చేయాలనే దానిపై అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ-2 రాజల కొండారెడ్డి, ఎస్ఎస్ఎ ఎఇ ప్రకాష్ పాల్గొన్నారు.

ఈ క్రాప్ నమోదు తప్పనిసరి

ప్రజాశక్తి -గిద్దలూరు రూరల్

మండల పరిధిలోని కష్ణంశెట్టి పల్లె-2 రైతు భరోసా కేంద్రం వద్ద వ్యవసాయ సలహా మండలి సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ వై. విజయ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ రబీ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులు ఈ క్రాప్ నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. అనంతరం ఈ క్రాప్ నమోదు ప్రక్రియను క్షేత్రసాయిలో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీనివాసరెడ్డి, రైతు భరోసా కేంద్రం సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాసరావుకు పురస్కారం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం పభుత్వ ఏరియా వైద్యశాలలో ఐసిటిసి కౌన్సిలర్‌గా పని చేస్తున్న బి. శ్రీనివాసరావు జిల్లా స్థాయిలో ఎయిడ్స్ రోగులకు మంచి సేవలు అందించినందుకు గాను ఒంగోలు ప్రాంతీయ వైద్యశాలలో డిఎంఅండ్‌హెచ్ఒ రాజ్యలక్ష్మి అత్యున్నత పురస్కారం అందజేశారు. యర్రగొండపాలెం, పుల్లలచెరువు, త్రిపురాంతకం మండలాల్లో ప్రజలకు అవగాహన కల్పించి రక్త పరీక్షలు నిర్వహించడం, ఎయిడ్స్ రోగులను గుర్తించి వారిలో అత్మధైర్యాన్ని నింపి క్రమం తప్పకుండా మందులు వినియోగించేలా కృషి చేసినందుకు ఈ అవార్డు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



అమరేశ్వరరావు దంపతులను సన్మానిస్తున్న ఎంపిపి

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు

తర్లుపాడు : ఉద్యోగులు అంకిత భావంతో పనిచేస్తే ఎప్పటికీ తగిన గుర్తింపు ఉంటుందని ఎంపిపి సూరెడ్డి భూలక్ష్మి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ నరసింహులు అధ్యక్షతన ఇఒఆర్‌డి అమరేశ్వర రావు ఉద్యోగ విరమణ సభ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి భూలక్ష్మి మాట్లాడుతూ ఇఒఆర్‌డి అమరేశ్వర రావు క్రమశిక్షణ, పట్టుదల, సత్ ప్రవర్తన కలిగి, అంకితభావంతో తమ వత్తిని సజావుగాకొనసాగించారని తెలిపారు. నిబద్ధతతో పనిచేసి అందరి మన్ననలు పొందాడని కొనియాడారు. అనంతరం అమరేశ్వరరావు దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ నరసింహులు, ఎంఇఒ దేవరకొండ సుజాత, ఎపిఎం పిచ్చయ్య. సెక్రటరీలు కాలంగి శ్రీనివాసులు, వై.గీత, జె. పద్మ, అచ్యుతరావు, కాశయ్య, తిరుపాలు, ఎంపిటిసిలు, సర్పంచులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ ప్రారంభం

ప్రజాశక్తి-వెలిగండ్ల

రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ స్థాయిలో క్రీడాకారులను ప్రోత్సహించడానికి ఆడుదాం ఆంధ్రప్రదేశ్ క్రీడా పోటీలకు రిజిస్ట్రేషన్ ప్రారంభించినట్లు ఎంపిడిఒ తాతపూడి సుకుమార్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో వెలుగు ఎపిఎం ఉపాధి హామీ ఎపిఒ, సిబ్బందితో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ సుకుమార్ మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి ఐదు దశల్లో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి దశలోనూ క్రీడాకారుల ప్రతిభ గుర్తించి విజేతలకు మెమోంటోలు, సర్టిఫికెట్లు, నగదు పురస్కారాలతో సత్కరించనున్నట్లు తెలిపారు. 15 సంవత్సరాలు నిండిన బాల, బాలికలను భాగస్వామ్యం చేసేందుకు, యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకే క్రికెట్, వాలీబాల్, ఖోఖో, బ్యాడ్మింటన్, కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 13న రిజిస్ట్రేషన్ కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ ఎపిఒ, వెలుగు ఎపిఎం, స్వచ్ఛభారత్ మండల కోఆర్డినేటర్ అన్నపురెడ్డి కష్ణయ్య, వెలుగు సిసిలు, ఉపాధి హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దేశంలో లౌకిక శక్తులు బలపడాలి


డాక్టర్ గౌతమ్ నాగిరెడ్డి



రేవంత్‌రెడ్డితో మాట్లాడుతున్న డాక్టర్ గౌతమ్‌రెడ్డి

ప్రజాశక్తి-మార్కాపురం

మతోన్మాదం ముసుగులో భారతీయుల్లో విభేధాలు తలెత్తుతున్నాయని, అందరూ ఐక్యంగా జీవనం సాగించాలంటే దేశంలో లౌకిక శక్తులు బలపడాల్సిన అవసరం ఎంతైనా ఉందని మార్కాపురంలోని శ్రీ కందుల ఓబులరెడ్డి హాస్పటల్ అధినేత డాక్టర్ కందుల గౌతమ్ నాగిరెడ్డి తెలిపారు. తెలంగాణ ఎన్నికలు ముగిసిన తరువాత తెలంగాణ పిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డితో డాక్టర్ గౌతమ్ నాగిరెడ్డి శుక్రవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో కాంగ్రెస్ పార్టీ బలపడుతోందన్నారు. తెలంగాణలో ప్రభుత్వం ఏర్పాటు చేసే దిశగా ఫలితాలు రాబోతున్నాయని ఎగ్జిట్ పోల్స్ చెబుతున్నాయని తెలిపారు. వచ్చే అన్ని ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌తో పాటు ఇండియా కూటమి గెలుపొందాలని ఆయన ఆశించారు. అనంతరం పలు రాజకీయ అంశాలపై వారి మధ్య చర్చ సాగింది. ఎపిలో రాజకీయ పరిస్థితుల గురించి ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి అడిగి తెలుసుకున్నట్లు తెలిసింది.



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్

బాల్య వివాహాలను నివారించాలి

కనిగిరి : బాల్య వివాహాల రహిత కనిగిరే ధ్యేయమని మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ తెలిపారు. కనిగిరి-7 సచివాలయం వద్ద బాల్య వివాహాల నిరోధక కమిటీ చైర్మన్ గఫార్ అధ్యక్షతన వార్డు బాల్య వివాహాల నిరోధక కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశంలో కిశోర బాలికల సర్వే , అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని, గ్రామ, వార్డు స్థాయిల్లో వివాహాల వివరాలు సేకరించాలని, కిశోర బాలికల వివాహలపై తీసుకున్న చర్యలు,పునరావాస ప్రణాళిక పై తీసుకున్న చర్యలు, కిశోర బాలికల కుటుంబాలకు కౌన్సిలింగ్ ఇవ్వాలని తీర్మానించారు. తొలుత మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్, ఎస్‌బిసిసి జిల్లా కోఆర్డినేటర్ కిరణ్ కుమార్ సచివాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి వార్డును బాల్య వివాహల రహిత వార్డుగా తీర్చిదిద్దేందుకు ప్రతి నెల మొదటి శుక్రవారం బాల్య వివాహాల నిరోధక కమిటీ సమావేశాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు అడ్మిన్ సునీల్ కుమార్, ఎఎన్ఎం లక్ష్మి, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ ప్రతినిధి ప్రేమ్ కుమార్, పారా లీగల్ వాలంటీర్ నవ కుమార్, అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు, వాలంటీర్లు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ధ్యేయం : ఎంపిపి



మాట్లాడుతున్న ఎంపిపి శ్రీనివారావు

ప్రజాశక్తి- దర్శి

పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని తాళ్లూరు ఎంపిపి తాటికొండ శ్రీనివాసరావు తెలిపారు. తాళ్లూరు మండలం మాధవరంలో గ్రామ సర్పంచి తాటికొండ రేణుక అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు కావాలి కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి తాటికొండ శ్రీనివాసరావు, జడ్‌పిటి మారం వెంకటరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అందరికీ సమ న్యాయం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు తూము సుబ్బారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు యాడిక శ్రీనివాసరెడ్డి, కుమ్మిత జయరామిరెడ్డి, సర్పంచులు సుబ్బారావు, వలి, ఎంపిడిఒ యువకీర్తి, పంచాయతీ కార్యదర్శి దేవదానం, గ్రామ సచివాలయ ఉద్యోగులు, వాలంటీరు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పెద్దారవీడు : మండల పరిధిలోని తోకపల్లి గ్రామంలో వైఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి మండల కన్వీనర్ పాలిరెడ్డి కృష్ణారెడ్డి మాట్లాడుతూ జగనన్న పాలనలో పేదల జీవితాలు బాగుపడుతున్నారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి ఏరువ చలమారెడ్డి, ఎంపిపి బెజవాడ పెద్దగురవయ్య, సర్పంచి జిల్లెల మల్లీశ్వరి, ఎంపిటిసి ఉప్పలపాటి భాగ్యరేఖ, సోషల్ మీడియా మండల కన్వీనర్ శొంఠి నాగార్జునరెడ్డి, నాయకులు రామచంద్ర యాదవ్, మేకల కాశయ్య, ఉప్పలపాటి దానం, ఉప్పలపాటి శ్యామ్‌బాబు, నరాల వెంకటనారాయణ, వల్లెల ఈశ్వర్‌రెడ్డి, జిలెల్ల గాలిరెడ్డి, తాళ్లూరి సాయికష్ణ, చేతుల నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీలో పాకల విద్యార్థినికి పతకం

ప్రజాశక్తి- శింగరాయకొండ



విద్యార్థినికి అభినందనలు

రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ కబడ్డీ పోటీల్లో మండలంలోని పాకల జెడ్పి హైస్కూల్ విద్యార్థిని కాంస్య పతకం సాధించినట్లు హెచ్ఎం ప్రసాద్ తెలిపారు. స్కూల్ గేమ్స్ అండర్ 17రాష్ట్రస్థాయి పోటీలు చిత్తూరు జిల్లా చౌడేపల్లి జెడ్పి ఉన్నత పాఠశాలలో జరగగా ప్రకాశం జిల్లా తతీయ స్థానాన్ని సాధించింది. జట్టులో పాకల విద్యార్థిని కె త్రిగుణ అద్భుత ప్రదర్శన కనబరిచి కాంస్య పతకం సాధించినట్లు పిఇటి పిల్లి హజరత్తయ్య తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో మెడల్ సాధించిన విద్యార్థినిని అభినందించారు.



తహశీల్దారుకు వినతి పత్రం అందజేస్తున్న బాధితులు

తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి - శింగరాయకొండ

మండలంలోని శానంపూడి గ్రామం అరుంధతి నగర్‌లో కుల, గ్రామ బహిష్కరణపై తాసిల్దార్ కార్యాలయం వద్ద 17కుటుంబాల బాధితులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. తాహసిల్దార్ సిహెచ్ ఉషాకు వినతిపత్రం అందజేశారు. మాతమ్మ గుడి తిరుణాలకు డబ్బులు ఇవ్వలేదన్న అక్కసతో గ్రామంలో కుల, గ్రామ బహిష్కరణ విధించి ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. దండోరా వేయించి మాట్లాడితే రూ.10వేల జరిమానాన్ని కుల పెద్దలు ప్రకటించారని అన్నారు. ఏఎస్ఐ మహబూబ్ బాషా ఆధ్వర్యంలో బహిష్కరణ వేసిన కుల పెద్దలు 12 మందిపై కేసు నమోదు చేశారు. 41నోటీసులు అందజేసినట్లు పోలీసులు చెబుతున్నారు. అయితే గ్రామంలో కుల బహిష్కరణ చేసిన 17కుటుంబాల వాళ్ళు తాహసిల్దార్ సిహెచ్ ఉషాను కలిసి గ్రామంలో జరుగుతున్న విషయాన్ని వివరించారు. దీనిపై తహసిల్దార్ సిహెచ్ ఉష సిఐ దాచేపల్లి రంగనాథ్ ఆధ్వర్యంలో ఇరు వర్గాలతో మాట్లాడి సమస్య లేకుండా చేస్తామని హామీ ఇచ్చారు.



మెడల్ అందుకున్న విద్యార్థులకు మాగుంట అభినందనలు

విద్యార్థులకు గోల్డ్ మెడల్స్

ప్రజాశక్తి - కొండపి

స్థానిక మాగుంట సుబ్బరామిరెడ్డి డిగ్రీ కళాశాలలో చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు గత సంవత్సరంలో విద్యార్థులు చూపిన మెరిట్ ఆదారంగా గోల్డ్ మెడల్, సర్టిపికేట్లను ఎంపి మాగుంట శ్రీనివాసులరెడ్డి తనయుడు రాఘవరెడ్డి చేతుల మీదుగా అందజేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఇ స్వామిదాస్ తెలిపారు. మాగుంట సుబ్బరామిరెడ్డి 28వ వర్థంతి సందర్భంగా మెడలు సాదించిన కె శిరీష, సిహెచ్ హెప్పిబాకు మాగుంట రాఘవరెడ్డి చేతుల మీదుగా మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో స్త్రీశిశు సంక్షేమ సంఘం చైర్మన్, జడ్‌పిటిసి మారెడ్డి అరుణ వెంకటాద్రిరెడ్డి, మాజి పిడిసిసి బ్యాంకు చైర్మన్‌డాక్టర్ మాదాసి వెంకయ్య, కళాశాల ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు అనుకూల పవనాలు

ప్రజాశక్తి - పొదిలి

తెలంగాణ, చతిస్గడ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం తథ్యమని కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ సైదా అన్నారు. దేశవ్యాప్తంగా ఐదు రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికలలో కాంగ్రెస్ విజయ దుందుభి మోగించబోతుందని పేర్కొన్నారు. బిజెపికి రానున్న సాధారణ ఎన్నికలే చివరి ఎన్నికలని అన్నారు.

యుటిఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక



అధ్యక్ష, కార్యదర్శులు సురేష్‌కుమార్, శ్రీనివాసరావు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

యుటిఎఫ్ మండల నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా వి సురేష్ కుమార్, ఎం శ్రీనివాసరావుతోపాటు కార్యవర్గ సభ్యులను శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించినట్లు యుటిఎఫ్ బాపట్ల జిల్లా కార్యదర్శి కెవి శ్రీనివాసరావు తెలిపారు. గౌరవ అధ్యక్షులుగా కె వేగేశ్వరరావు ఎన్నికైనట్లు ఆయన తెలిపారు. రేపల్లెలోని ఎంసీపీ హాలులో కామ్రేడ్ మహమ్మద్ గౌస్ ప్రాంగణంలో డిసెంబర్ 3న జరగనున్న యుటిఎఫ్ స్వర్ణోత్సవ ప్రారంభ వేడుకలు, బాపట్ల జిల్లా ద్వితీయ నూతన కౌన్సిల్ సమావేశం విజయవంతం చేయాలని యుటిఎఫ్ మండల నూతన కౌన్సిల్ అధ్యక్ష, కార్యదర్శులు వి సురేష్ ఎం శ్రీనివాసరావు కోరారు.

రేపల్లె : యూటిఎఫ్ మండల నూతన కమిటీ శుక్రవారం ఎన్నికైంది. స్థానిక యుటీఎఫ్ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి ఎంవివి సుబ్రమణ్యం ఎన్నికల పరిశీలకుడు రాష్ట్ర కౌన్సిలర్ కె వెంకయ్య ఆధ్వర్యంలో ఎన్నిక నిర్వహించారు. యుటిఎఫ్ మండల గౌరవ అధ్యక్షులుగా వైసిఎస్ కృపారావు, అధ్యక్షులుగా చాటగడ్డ రాజ భూషణం, ఉపాధ్యక్షులుగా ఎం సత్యనారాయణ, టి ఉదయభాను, ప్రధాన కార్యదర్శిగా వివి సుబ్బారావు, కోశాధికారిగా వి పున్నారావు, మండల కార్యదర్శులు, జిల్లా కౌన్సిలర్లు, మహిళా కమిటీ కన్వీనర్లను ఎంపిక చేశారు. నూతన కమిటీ సభ్యులచే ఎన్నికల పరిశీలకుడు కె వెంకయ్య ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు రవీంద్ర, ఫ్రాన్సిస్, రాధాకృష్ణమూర్తి, జి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



యుటిఎఫ్ గౌరవ అధ్యక్షులు, అధ్యక్ష, కార్యదర్శులు

ఎన్‌జిఒ సంఘం నేత మృతి

ప్రజాశక్తి - పొదిలి



ఎన్‌జిఒ నేత శ్రీనివాసరెడ్డి

మండలంలోని ఉప్పలపాడు పిహెచ్‌సి హెల్త్ సూపర్ వైజర్‌గా పనిచేస్తున్న పొదిలి తాలూకా ఎన్‌జిఒ సంఘం అధ్యక్షులు నారు శ్రీనివాసరెడ్డి శుక్రవారం విధినిర్వహణలో గుండెపోటుతో మరణించారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని కమ్యూనిటి వైద్యశాల నుండి తమ వైద్య సిబ్బందితో ర్యాలీగా పెద్ద బస్టాండ్‌కు చేరుకున్నారు. అక్కడ ఎయిడ్స్ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ మాట్లాడారు. అనంతరం కొద్ది సేపటి తరువాత అలసటగా ఉందని చెప్పడంతో వెంటనే ప్రభుత్వ వైద్యశాలలో సేద తీరుతూ ఒక్కసారిగా సరిగా కుప్పకూలిపోయారు. అక్కడ ప్రాథమిక చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం స్థానిక ఉడముల వైద్యశాలకు తరలించారు. అప్పటికే ఆయన మతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. ఈ విషయం తెలిసిన పట్టణ ప్రజలు ఒక్కసారిగా శోకసంద్రంలో మునిగిపోయారు. శ్రీనివాసరెడ్డి మరణ వార్త తెలిసిన పలువురు వైద్యశాల వద్దకు భారీగా చేరుకున్నారు. మూడు ధపాలుగా తాలూకా ఎన్‌జిఒ సంఘం అధ్యక్షులుగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయన మంచి మనిషిగా గుర్తింపు పొందారు. ఎన్‌జిఒ సంఘానికి నూతన భవనం, ఇతర విషయాలలో ప్రత్యేక శ్రద్ద కనబరిచి కార్యకర్తలకు, నాయకులకు తలలో నాలుకగా వ్యవహరించే శ్రీనివాస రెడ్డి మరణంతో ఒక మంచి ఉద్యోగిని, నాయకుడిని కోల్పోయామని సహచరులు ఆవేదన వ్యక్తం చేశారు. కొద్దిసేపు ఉడుముల వైద్యశాల వద్ద ఉన్న మృతదేహాన్ని పలువురు ప్రముఖులు సందర్శించి నివాళులర్పించారు. కాగా శ్రీనివాసరెడ్డి అంత్యక్రియలు మార్కాపురం మండలం గజ్జలకొండ గ్రామంలో శనివారం నిర్వహించనున్నట్లు వైద్యసిబ్బంది తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

శ్రీనివాసరెడ్డి మరణం భాదాకరమని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎం రమేష్, ప్రకటనలో తెలిపారు. ఎల్లప్పుడూ చిరునవ్వుతో ఎలాంటి సమస్యనైనా సున్నితంగా పరిష్కారం చేసే శ్రీనివాసరెడ్డి మరణం ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక ఉద్యమాలకు తీరనిలోటని అన్నారు. ఆయన మతికి సిఐటియు జిల్లా కమిటి సంతాపం తెలిపారు.

శ్రీనివాసరెడ్డి మృతికి యుటిఎఫ్ సంతాపం

ఏపీ ఎన్జీవో సంఘం అధ్యక్షులు నారు శ్రీనివాస్‌రెడ్డి మరణం ఉద్యోగ, ఉపాధ్యాయ ఉద్యమానికి తీరనిలోటని యుటిఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు పి రమణారెడ్డి, జిల్లా సహ అధ్యక్షులు షేక్ అబ్దుల్‌హై, జిల్లా కార్యదర్శి పి బాల వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఐక్య జేఏసీ ఆధ్వర్యంలో చేరి పిఆర్సి ఉద్యమంలో వెనుదన్నుగా ఉండి 2022 విజయవాడ ఉద్యమం విజయవంతం చేయడంలో కీలకపాత్ర వహించారని అన్నారు. కరోనా సమయంలో ఆయన వైద్య సేవలు మరువలేవని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు బుజ్జిబాబు, పొదిలి, కొనకనమిట్ల, మరిపూడి మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్ సత్యనారాయణరెడ్డి, కె నాసర్‌మహమ్మద్, సిహెచ్ లింగయ్య, పాలడుగు వెంకటేశ్వర్లు, ఎస్ కామేశ్వరరావు, సిహెచ్ కోటేశ్వరరావు, పి శ్రీనివాస్‌రెడ్డి, సంజీవరావు, కపారావు, బాల కాశిరెడ్డి, గోనే శ్రీనివాసులు, వెన్నెల మల్లికార్జునరావు, చవల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - పొన్నలూరు



రైతులతో ఎంఎల్ఎ బాలవీరాంజనేయస్వామి

మండలంలోని చెరుకూరు గ్రామానికి వచ్చిన కొండేపి శాసన సభ్యులు డాక్టర్ డోలా శ్రీ వీరాంజనేయ స్వామి విలేకర్లతో మాట్లాడారు. చెరుకూరు, ముండ్లమూరి వారి పాలెం, తిమ్మపాలెం, పెరికే పాలెం, వెంకు పాలెం, పైరెడ్డి పాలెం, నాగిరెడ్డిపాలెం గ్రామాల్లో సుమారు 500మంది దొంగ కౌలు పత్రాలు పొంది ఉన్నారని ఆవేశం వ్యక్తం చేశారు. నిజమైన రైతులకు అన్యాయం జరిగిందనిఅన్నారు. 10సంవత్సరాల క్రితమే చని పోయిన రైతులు కౌలు పత్రాలు రాశించి నట్టుగా పొందు పరచడం ఎంత దుర్మార్గమైన చర్యని ప్రశ్నించారు. నకిలీ పత్రాలు పొందిన రైతుల మీద, నకిలీ కార్డులు ఇచ్చిన అధికారుల మీద చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని రైతులకు హామీ ఇచ్చారు. ఈ విషయాన్ని కలెక్టర్ ద్రుష్టికి తీసు కొని వెళ్లి నకిలీ కార్డులను రద్దు చేపించి, ఇప్పటి వరకు బినామి పేరుతో పొందిన నగదు రికవరీ చేపిస్తామని అన్నారు. వాలంటీర్స్ కూడా వాళ్ళ చేతి వాటం చూపించి రైతులను మోసగించారని అన్నారు. బినామి రైతుల దగ్గర నుండి నగదును గుంజుకొని వచ్చే ఎన్నికలలో జగనన్నకు ఓట్లు వెయ్యాలని వాలంటీర్‌లు బినామి కౌలు రైతులకు ప్రచారాలు చెయ్యటం, కరెక్ట్ కాదని అన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు అనుమాలు సాంబశివరావు, కె కోటిరెడ్డి, ఎం ప్రసాద్, ఎన్ వెంకటేశ్వర్లు, జి మల్లికార్జున, పి వెంకట నారాయణరెడ్డి పాల్గొన్నారు.



ఫ్యాక్టరీలో తనిఖీలు చేస్తున్న కార్మిక శాఖ అధికారులు

బాల కార్మిక నిర్మూలనకు తనిఖీలు

ప్రజాశక్తి - శింగరాయకొండ

రాష్ట్ర ప్రభుత్వ కార్మిక శాఖ ఆధ్వర్యంలో పాన్ ఇండియా బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకై రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్న నేపథ్యంలో అసిస్టెంట్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ మెర్సివిజయ సారధ్యంలో శుక్రవారం వివిధ ఫ్యాక్టరీలలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థ నిర్మూలకై రాష్ట్ర ప్రభుత్వం విశేష కషి చేస్తుందని అన్నారు. ఇందులో భాగంగానే ఫ్యాక్టరీలను, పొగాకు గూడెంలను, షాపింగ్ మాల్స్, దుకాణాల్లో తనిఖీలు చేస్తున్నామని అన్నారు. స్థానిక దేవి సీఫుడ్స్ ఫ్యాక్టరీ, లక్ష్మి ఎంటర్ప్రైజెస్ పొగాకు గూడెంలలో తనిఖీలు చేశారు. ఆయా ఫ్యాక్టరీల్లో 18ఏళ్లలోపు పిల్లలు లేరని నిర్ధారించుకున్నారు. చిన్నారులను పనుల్లో పెట్టుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ దిశ పోలీస్ స్టేషన్ ఎస్ఐ సారా కుమారి, ఏఎస్ఐ చంద్రలీల, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ మేరీసుజాత, ఐసిపిఎస్ సిబ్బంది శ్యామ్యూల్ రాజు, సాడ్స్ సిబ్బంది సుమన్, వెంకట్రావు, న్యాయ సేవా సహాయకులు పంతగాని వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



సమావేశంలో లీగల్‌మెట్రాలజీ అధికారి అనిల్‌కుమార్

సిబ్బందికే తూనికలు, కొలతల బాధ్యతలు

ప్రజాశక్తి - పొదిలి

గ్రామాలలో, పట్టణాలలో క్షేత్రస్దాయిలో తూనికలు, కొలతల నిర్వహణ బాధ్యత సచివాలయం ఇంజనీరింగ్ సిబ్బంది బాధ్యతలు తీసుకోవాలని కనిగిరి తూనికలు కొలతల శాఖ అధికారి అనిల్ కుమార్ తెలిపారు. స్దానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఎంపిడిఓ శ్రీకృష్ణ అధ్యక్షతన జరిగిన కనిగిరి రెవిన్యూ డివిజన్ పరిధిలోని 13మండలాలు, రెండు నగర పంచాయతీల సచివాలయ, వార్డు ఇంజనీరింగ్ సిబ్బందిలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. అందుకు అనువుగా వారికి శిక్షణ ఇచ్చారు. నిర్ధేశిత యాప్ ద్వారా క్షేత్రస్ధాయిలో తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేసే విధంగా ఉంటుందని అన్నారు. గృహానిర్మాణంలో కూడా క్షేత్రస్దాయి పరిశీలనకు అనువుగా సిబ్బందికి మార్కాపురం డివిజన్ ఇంజనీర్ పన్ కుమార్ వివరించారు.



పంట నమోదు చేస్తున్న ఎఒ విజయ్‌కుమార్

5650 ఎకరాలలో పంటలు సాగు

ప్రజాశక్తి - కొండపి

మండలంలోని వివిధ రైతు భరోసా కేంద్రాల పరిధిలో 5650ఎకరాలలో వివిధ పంటలు సాగైనట్లు ఇప్పటి వరకు రికార్డు చేసినట్లు ఎఒ డి విజయ్‌కుమార్ తెలిపారు. మండలంలోని కట్టవారిపాలెం పొలాల్లో వివిద పంటల నమోదు కార్యక్రమం శుక్రవారం చేపట్టారు. ఏవో మాట్లాడుతూ మండలంలో పొగాకు 4000ఎకరాలలో, శనగ 1100ఎకరాలలో, వరి 210ఎకరాలలో, మిరప 302ఎకరాలలో, ఇతర పంటలు 38ఎకరాలలో మొత్తం విస్తీర్ణం 5650ఎకరాలలో పంటలు సాగైనట్లు తెలిపారు. సాగు చేస్తున్న రైతులు అందరూ తప్పని సరిగా పంట నమోదు చేయించుకోవాలని తెలిపారు. పంట నమోదు దరఖాస్తు పారం, ఆదార్ కార్డు జిరాక్సు, పొలం 1-బి, మొబైల్ నెంబర్ తీసుకొని సంబందిత రైతు భరోసా కేంద్రాలలోనివ్యవసాయ సహాయకులను సంప్రదించి నమోదు చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో విఎఎ అబీద్ పాల్గొన్నారు.

అసలు అధికారిని వదిలేశారు..

- భూఅక్రమాల్లో కీలక వ్యక్తిని వదిలేసిన పోలీసులు
- సహకరించిన వారినే కేసులో ఇరికించే యత్నం

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం ప్రాంతంలో భూ అక్రమాలు జరిగాయని రాష్ట్రవ్యాప్తంగా ప్రచారం జరుగుతున్న విషయం తెలిసిందే.. ఈ నేపథ్యంలో సిట్ దర్యాప్తు బృందాన్ని ప్రభుత్వం నియమించింది. అక్రమాలపై సిట్‌కు బాధితుల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయి. సిట్ దర్యాప్తు బృందం నియామకానికి ముందు కొందరు తమకు జరిగిన అన్యాయంపై సిఎఫ్‌ఆర్ ద్వారా కోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు కోర్టు స్పందించింది. భూ అక్రమాల్లో వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని పోలీస్ శాఖను ఆదేశించింది. పోలీస్ శాఖ విచారణ తీరు హాస్యాస్పదంగా ఉందనే చర్చ నడుస్తోంది. అక్రమాలకు కారణమైన కీలక బాధ్యులను వదిలిపెట్టి... దానికి సహకరించిన వారే ప్రధాన నిందితులు అన్నట్లుగా వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది.!

మార్కాపురం పట్టణంలోని పలకల పారిశ్రామికవాడ ప్రాంతంలోని సర్వే నెంబరు 1180/1లో ప్లాట్లుగా విభజించబడిన స్థలంలో 83, 84 నెంబర్లు కలిగిన ప్లాట్లను (240 చ.గ.) పుల్లలచెరువు గ్రామానికి చెందిన గుంటూరి వీరనారాయణ అనే వ్యక్తి కొనుగోలు చేశారు. డాక్యుమెంట్ నెం: 722/2001తో గుంటూరి వీరనారాయణ పేరున రిజిష్టర్ చేసుకున్నారు. ఈ భూమిని కాజేయాలని భావించిన మార్కాపురం మండలం ఇడుపూరుకు చెందిన నాలి గోపాలక్రిష్ణ నకిలీ వీరనారాయణను సృష్టించాడు. అసలైన



గుంటూరి వీరనారాయణకు బదులుగా ఆ పోలికలతో ఉన్న వ్యక్తిని పట్టుకొచ్చి అసలు వీరనారాయణగా ఆధార్‌లో అడ్రస్ మార్చారు. నకిలీ వ్యక్తి ద్వారా నాలి గోపాలక్రిష్ణ ఆ స్థలాన్ని రిజిష్టర్ చేసుకునేందుకు ఎలాంటి అనుమానం కలగకుండా అన్ని ఏర్పాట్లూ చేసుకున్నారు. ఇదంతా ఆధార్ సెంటర్‌లో జరిగింది. దీంతో అక్రమం కాస్తా... సక్రమంగా జరిగిపోయేదానికి మార్గం సులువైంది. ఈ రిజిస్ట్రేషన్‌లో ఒరిజినల్ డాక్యుమెంట్లను చూపనేలేదు. సబ్‌రిజిస్ట్రార్ ఎలా కుమ్మక్కయ్యాడో తెలియదు గానీ... రిజిష్టర్ చేసుకోవచ్చని సెలవిచ్చారు. నాలి గోపాలక్రిష్ణ అనే వ్యక్తి కూర్మారాయుని బొజ్జయ్య అనే దస్తావేజు లేఖరిని సంప్రదించాడు. ఆ స్థలానికి నకిలీ యజమానిగా తయారుచేసిన వ్యక్తి ఆధార్ పరిశీలించగా గుంటూరి వీరనారాయణ అనే రావడం జరిగింది. ఆధార్ సెంటర్‌లో గుంటూరి వీరనారాయణగా నకిలీ వ్యక్తి మార్పులు ముందుగా చేసుకోవడంతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో థంబ్ వేసినా ఇకెవైఎస్‌లో అతనే గుంటూరి వీరనారాయణ అనే విధంగా తెలిసింది. సబ్‌రిజిస్ట్రార్ సూచనల మేరకు ఓ దస్తావేజు లేఖరి దస్తావేజు తయారు చేశారు. ఇందులో ఒరిజినల్ దస్తావేజు చూపనందున నకలు కాపీ ద్వారా రిజిష్టర్ చేస్తున్నట్లు పొందుపర్చారు. వాస్తవంగా ఒరిజినల్ దస్తావేజులు లేకుండా రిజిష్టర్ చేయకూడదు. అప్పట్లో మార్కాపురం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో పనిచేసిన సబ్ రిజిస్ట్రార్ బి.చింపిరయ్యబాబు అడ్డదిడ్డంగా రిజిస్ట్రేషన్ చేయడం జరిగింది. వాస్తవంగా ఇది అక్రమం అనేది రిజిస్ట్రార్ గుర్తించాల్సి ఉంది.

దస్తావేజు లేఖరి కూలి కోసం రోజంతా రిజిస్ట్రేషన్ చేసుకునే వారి కోసం ఎదురుచూసేవాడే గానీ... ఇది సక్రమమా... అక్రమమా అనేది తెలిసేది చాలా తక్కువనే చెప్పాలి. వాస్తవాలను సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సంబంధిత అధికారులు తెలుసుకోవాలి. సరైనది అనుకుంటేనే రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉంది. అలాంటిది ఒరిజినల్ డాక్యుమెంట్ లేకుండా రిజిష్టర్ చేసింది సబ్ రిజిస్ట్రార్ చింపిరయ్య బాబు మాత్రమే. ఈ భూమికి సంబంధించి ఒరిజినల్ గుంటూరి వీరనారాయణ కోర్టును ఆశ్రయించిన ఫలితంగా కేసు విచారణ మార్కాపురం పోలీసులకు చేరింది. ఇక్కడ విచారణలో సబ్ రిజిస్ట్రార్ ప్రస్తావన రావడం లేదు. అక్రమాలకు పాల్పడిన నాలి గోపాలక్రిష్ణ, ఆధార్ సెంటర్‌లో మార్పులు చేసిన వ్యక్తి, ఇందులో సాక్షులుగా ఉన్న వారితో పాటు రోజూ కూలీగా పనిచేసుకునే దస్తావేజు లేఖరి బొజ్జయ్యను కేసులో ఇరికించే ప్రయత్నం జరుగుతోంది. తప్పు ఎక్కడ జరిగింది... ఆ తప్పుకు బాధ్యులు ఎవరనే కోణంలో పోలీసులు విచారిస్తే అసలైన అక్రమార్కులు ఎవరనేది తేటతెల్లం కానుంది.!

అంగన్‌వాడీ కార్యకర్తకు సన్మానం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

వికాసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని గోళ్ళవిడిపి గ్రామ సచివాలయంలో శుక్రవారం సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ నాగేశ్వర ప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. వాటిని సద్వినియోగం చేసుకోవాల కోరారు. అనంతరం చిన్నారులకు, బాలింతలకు, గర్భిణులకు అంగన్‌వాడీ కేంద్రం ద్వారా పౌష్టికాహారం అందజేయడంలో ఉత్తమ ప్రతిభ కనపరిచిన కొత్త గోళ్ళవిడిపి అంగన్‌వాడీ కార్యకర్త పూజల మూర్తెమ్మను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ నాగేశ్వర ప్రసాద్, పాలుట్ల ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్, అంగన్‌వాడీ సూపర్ వైజర్ హేమలత, గ్రామ సర్పంచి పోలేబోయిన పద్మ, పంచాయితీ కార్యదర్శి రమేష్‌రెడ్డి, అంగన్‌వాడీలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వైసిపిని ఇంటికి సాగనంపాలి : డాక్టర్ ఉగ్ర

ప్రజాశక్తి - కనిగిరి

అరాచక పాలన సాగిస్తున్న వైసిపిని ఇంటికి సాగనంపాలని మాజీ ఎమ్మెల్యే, టిడిపి నియోజక వర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి తెలిపారు. కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని బొగ్గుల గొంది కాలనీ, మండల పరిధిలోని బల్లిపల్లిలో మన ఊరు-మన ఉగ్ర, బాబు ష్యూరిటీ, భవిషత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉగ్ర ఇంటింటికీ తిరిగి రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాల గురించి ప్రజలకు వివరించారు. ప్రజలు సమస్యలను అడిగి తెలుసుకుంటూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర అభివద్ధి మరిచి ప్రజలను ఇబ్బంది పెట్టేలా పాలన సాగిస్తున్న వైసిపి ప్రభుత్వాన్ని తరిమికొట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు నంబుల



మహిళతో మాట్లాడుతున్న డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి

వెంకటేశ్వర్లు, నాయకులు రాచమల్ల శ్రీనివాసరెడ్డి, ముచ్చుమారి చెంచిరెడ్డి ,షేక్ ఫిరోజ్, షేక్ అహ్మద్, తమ్మినేని వెంకట్ రెడ్డి, కాసు హరికష్ణ రెడ్డి, పిచ్చాల శ్రీనివాసులు రెడ్డి, తమ్మినేని సురేంద్రరెడ్డి, చింతలపూడి తిరుపాలు, ఆర్‌వి.నారాయణ, సత్యం పాల్గొన్నారు.

11వ వసంతంలోకి 'లక్ష్మీ' హాస్పిటల్

- అన్నిరకాల న్యూరో వైద్య సేవలను ఒకేచోట అందిస్తూ జిల్లాలో ప్రత్యేక గుర్తింపు
- 4న జర్నలిస్టులకు ఉచిత వైద్యపరీక్షలు..

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్



డాక్టర్ రవీంద్రబాబు

ఒంగోలులో రాంనగర్ ఆరోలైన్ వద్ద రిమ్స్ ఆసుపత్రి ఎదురుగా ఉన్న లక్ష్మీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఈ నెల నాలుగో తేదీ నాటికి పదేళ్ళు పూర్తి చేసుకొని 11వ ఏడాదిలోకి అడుగు పెట్టనుంది. బ్రెయిన్ అండ్ స్పెయిన్‌కు సంబంధించిన అన్ని న్యూరో వైద్య సేవలు ఒకేచోట అందిస్తూ జిల్లాలో ఈ ఆసుపత్రి ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. ఈ పదేళ్ల పాటు తమ ప్రయాణంలో తమకు తోడుగా ఉండి, తమ ఎదుగుదలకు తోడ్పాటునందించిన పేషెంట్లకు ఆసుపత్రి డాక్టర్ అబ్బూరి రవీంద్రబాబు ఓ ప్రకటనలో ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ పదేళ్ల కాలంలో న్యూరో వైద్యం అంటే లక్ష్మీ ఆసుపత్రి, లక్ష్మీ ఆసుపత్రి అంటే న్యూరో వైద్యం అన్నట్లుగా తమ వైద్య సేవలు కొనసాగించడం ఆనందంగా ఉందన్నారు. 11వ వసంతం లోకి అడుగుపెడుతున్న సందర్భంగా త్వరలోనే తాము 'కాల్ యువర్ డాక్టర్' ప్రోగ్రాంని ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఆదివారం మినహా మిగిలిన రోజుల్లో సాయంత్రం ఆరు గంటల నుంచి ఎనిమిది గంటల వరకు న్యూరోకు సంబంధించి ఎలాంటి సలహాలు, సందేహాలైనా కాల్ యువర్ డాక్టర్ ద్వారా నివృత్తి చేసుకోవచ్చని తెలిపారు. ఆడియోకాల్, వీడియో కాల్ ద్వారా కాల్ చేసిన వారికి అందుబాటులో ఉంటామని చెప్పారు. ఆసుపత్రి ప్రారంభించిన ఈ పదేళ్ల కాలంలో తమ ఆసుపత్రి



లక్ష్మీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి

ద్వారా సుమారు 1500 మందికి పైగా రోగులకు న్యూరో సర్జరీలు, సుమారు ఆరు వందల మందికి పైగా స్పెయిన్ సర్జరీలు నిర్వహించామని పేర్కొన్నారు. పదేళ్ల పాటు తమకు అడుగడుగునా అండగా నిలిచిన వారందరికీ ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

జర్నలిస్టులకు ఉచిత వైద్యపరీక్షలు..

తమ ఆసుపత్రి 11వ వార్షికోత్సవం సందర్భంగా ఒంగోలులో పనిచేసే ప్రింట్‌అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులకు ఆసుపత్రి ఆవరణలో ఈ నెల నాలుగో తేదీన ఉదయం 11 గంటల నుంచి ఉచిత వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నట్లు డాక్టర్ అబ్బూరి రవీంద్రబాబు పేర్కొన్నారు. రూ.3 వేలు విలువైన టోటల్ బాడీ చెకప్ పరీక్షలన్నీ ఉచితంగానే నిర్వహిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా న్యూరో అండ్ స్పెయిన్‌కు సంబంధించిన సమస్యలపై జర్నలిస్టు సోదరులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జర్నలిస్టు సోదరులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



మాట్లాడుతున్న గుమ్మా బాలనాగయ్య

మార్కాపురం డివిజన్‌ను కరువు ప్రాంతంగా ప్రకటించాలి

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

మార్కాపురం డివిజన్‌ను కరువు ప్రాంతంగా ప్రకటించాలని, రైతులను ఆదుకోవాలని, వ్యవసాయ కార్మికులకు ఉపాధి కల్పించాలని కోరుతూ స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఉమ్మడి సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశానికి రైతు సంఘం నాయకులు ఏరువ పాపిరెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు గుమ్మ బాలనాగయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కరువు జిల్లాలు, మండలాలలో ఈ ప్రాంతంలోని ఒక్క మండలం కూడా లేకపోవడం దారుణమన్నారు. మార్కాపురం డివిజన్‌లోని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని కోరుతూ ఈనెల 5న ఉప కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించ నున్నట్లు తెలిపారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు సాగు చేసిన అరకొర పంటలు కూడా ఎండిపోతున్నట్లు తెలిపారు. వ్యవసాయ కార్మికులు పనులు లేక వలసలు పోవాల్సిన దుస్థితి ఏర్పడినట్లు తెలిపారు. గొర్రెలు, మేకలకు నీరు లేక పోషకులు వలస బాట పట్టినట్లు తెలిపారు. ఈ సమావేశంలో గంగిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, రేపని తిరుపతయ్య, కోలగట్ల సత్యనారాయణ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



గుంతలయమంగా మారిన రహదారి

రహదారికి మరమ్మతులు చేయాలి

ప్రజాశక్తి-హనుమంతునిపాడు

కందుకూరు నుంచి పెద్ద చెర్లోపల్లి, కనిగిరి, హనుమంతుడుపాడు మీదుగా కంభం, బేస్తవారిపేట రోడ్డును కలుపుతూ నిర్మించిన డబల్ రోడ్డు మూన్నాళ్ళ ముచ్చటగా మారినట్లు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బడుగు వెంకటేశ్వర్లు ఆరోపించారు. పొన్నలూరు నుంచి పెదచెర్లోపల్లి మండలం అలవలపాడు, ఎబిఆర్ కాలేజీ వరకూ రహదారిపై గుంతలు ఏర్పడినట్లు తెలిపారు. అలవలపాడు వద్ద పాలేటి వాగుపై నిర్మించిన బ్రిడ్జి, రామాపురం బస్టాండ్ సెంటర్ ప్రాంతాల్లోనూ రహదారిపై గుంతలు ఏర్పడినట్లు ఆయన తెలిపారు. దీంతో రాపోకలు సాగించేందుకు వాహన చోదకులు అవస్థలకు గురవుతున్నట్లు తెలిపారు. అధికారులు స్పందించిన రహదారిపై ఏర్పడిన గుంతలకు మరమ్మతులు చేపట్టాలని ఆయన కోరారు.

సహాయనిధి చెక్కు అందజేత

నాగులుప్పలపాడు : ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కును బాధిత కుటుంబానికి ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అందజేశారు. మండల పరిధిలోని మద్దిరాలపాడు గ్రామానికి స్వర్ణ రవీంద్ర బాబు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మతి చెందారు. మృతుడి కుటుంబాన్ని ఆదుకునేందుకు ముఖ్యమంత్రి సహయనిధి నుంచి వచ్చి రూ.6 లక్షల చెక్కును మృతుడి భార్య స్వర్ణ సబీనాకు ఎమ్మెల్యే బాలినేని శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.

తుఫాను హెచ్చరికలతో రైతుల్లో కలవరం

ప్రజాశక్తి - ఇంకొల్లు

బంగాళా ఖాతంలో ఏర్పడిన వాయుగుండం తుఫానుగా మారి రాబోయే మూడు రోజుల్లో కోస్తాంధ్రకు భారీగా వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలతో పొగాకు, మిరప సాగు చేసిన రైతులు కలవరం చెందుతున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సాగు ఆరంభం నుండి రబీ సాగు ప్రారంభం వరకు సకాలంలో సరిపడా వర్షాలు పడక సాగు చేసిన వివిధ పంటలు ఎండుతూ, వాడుతూ వస్తున్నప్పటికీ రైతులు తమకు చేతనైన భగీరథ ప్రయత్నాలు చేసి పంటలు కాపాడుకుంటూ వచ్చారు. సుదూర ప్రాంతాల నుంచి ట్యాంకర్లు, ఆయిల్ ఇంజన్ల ద్వారా నీటిని తరలించి మిరప, పొగాకు నాట్లు వేశారు. వేసిన నాట్లు ఎండు ముఖం పడుతున్నాయనుకున్న సమయంలో నవంబర్ నెల రెండో వారంలో కురిసిన వర్షం పంటలకు ఊపిరి పోసింది. దీంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. ఆలస్యంగానైన వైట్‌బర్లీ పొగాకు నాట్లు రబీ పంటగా శెనగ సాగు చేపట్టారు. ఇదిలా ఉంటే వర్షాభావ ప్రభావంతో నీరు అందుబాటులో లేకపోయినా దూర ప్రాంతాల నుంచి, వాగులు, కుంటల నుంచి నీరు ఆయిల్ ఇంజన్లు, ట్యాంకర్ల ద్వారా తరలించి ముందస్తు పొగనాట్లు వేశారు. మిరపకు తడులు ఇచ్చిన రైతులు తుఫాను హెచ్చరికతో ఆందోళన చెందుతున్నారు. ముందస్తు నాట్లతో బర్లీ పొగాకు తోటలు ఇప్పటికే ఏపుగా పెరిగాయి. నీరు కట్టిన ముదురు మిరప తోటలు కొన్ని కాపు దశకు వచ్చాయి. కొంత మంది మిరప పొలాలు



దెబ్బతిన్న వైట్‌బర్లీ పొగాకు చూపుతున్న రైతు

అడుగుకాపు ఇప్పటికే కాశాయి. వర్షాలు ఎక్కువగా పడితే ఇప్పటికే అధికంగా పెట్టుబడి పెట్టిన ముదురు బర్లీతో పాటు కాపుగాచిన ముదురు మిరప తోటలో వర్షం దెబ్బకు ఉరక ఎత్తే ప్రభావం ఉందని పొగాకు ఆకులు దెబ్బ తినడంతో పాటు మిరపకాయలు రంగు మారే అవకాశం ఉందని వాపోతున్నారు.

ఈపాటికి దెబ్బతిన్న పొగ తోటలు

నవంబర్లో కొన్ని ప్రాంతాల్లో అధికంగా వర్షం పడిన పర్చూరు, యాదనపూడి, కారంచేడు మండలాల్లోని వివిధ గ్రామాల్లో ఇప్పటికే బర్లీ పొగ తోటలు దెబ్బతిన్నాయి. లోతట్టు పొలాల్లో తోటలు దెబ్బతిన్నాయి. రైతులు దెబ్బతిన్న పొలాల్లో మొక్కలు తొలగించి మళ్లీ వ్యవసాయం చేసి 2వసారి నాట్లు వేశారు.

ఈపాటికే పొగనారుకు గిరాకి

దెబ్బ తిన్న పొలాలలో మళ్లీ నాట్లు వేయటంతో పాటు పొగాకు దర ఆశాజనకంగా ఉండటంతో ఆలస్యంగానైనా విస్తీర్ణం పెరగటంతో పొగనారుకు అత్యంత గిరాకీ ఏర్పడింది. నారు మూట రూ.6వేలపైనే ధర పడుతుంది. ఇలా లేటైతే నారు ధర రూ.10వేలు అవుతుంది. వ్యవసాయం ఎరువులు నాటు ఖర్చు, పొలం కౌలు అన్నీ కలుపుకొని నాటు వేసేసరికి ఎకరాకు రూ.60వేల వరకు ఖర్చు అవుతుంది. ఉరకెత్తిన పొగ తోటలకు మళ్లీ నాటు వేయటంతో అదనంగా మరో రూ.15వేలు ఖర్చు. ఇంత ఖర్చు పెట్టినా తుఫాను ప్రభావం ఎలా ఉంటుందోనని రైతంగంలో కలవరం మొదలైంది.

మిరప రైతుల్లో బొబ్బర కలవరం

పొగాకు సాగు రైతు పరిస్థితి అలా ఉంటే మిరప రైతుల్లోను వర్షం కలవరంతో పాటు బొబ్బర తెగులుతో సతమతం అవుతున్నారు. అధిక ఖర్చులు పెట్టి నీటి తడులు ఇచ్చి ఎరువులు వేసి సస్యరక్షణ చేపట్టి ఇప్పటి వరకు పంటలు కాపాడుకుంటూ వచ్చిన మిరప రైతుకు బొబ్బర తెగులు వెంటాడుతుంది. కొంత మంది రైతులు ఈ పాటికే బొబ్బర తెగులు సోకటంతో మిరప మొక్కలు పీకి వేస్తున్నారు. ఖర్చుపెట్టి నష్టపోతామని ఇప్పుడే పీకి వేస్తే శనగ, పొగాకు సాగు చేపడితే పెట్టిన పెట్టుబడిలో కొంతైనా దక్కుతుందని ఆలోచిస్తున్నారు. తెగులుకు తోడు వర్షాలు అధికంగా పడితే మిరప తోటలు ఉరకెత్తడంతో పాటు కాపు కొచ్చిన కాయలు రంగు మారి తాలుగా మారే అవకాశం ఉందని ఆవేదన చెందుతున్నారు. వర్షాలు కురిసి పైరులు బాగా ఉందనుకున్న సమయంలో తుఫాను హెచ్చరికలు, బొబ్బర తెగులు ఉధృతి రైతులకు నిద్రలేకుండా చేస్తున్నాయి.



ఘంటసాల జయంతి మాసోత్సవాలు ప్రారంభిస్తున్న కోట

ఘంటసాల జయంతి మాసోత్సవాలు

ప్రజాశక్తి - బాపట్ల రూరల్

ఘంటసాల 101వ జయంతి సందర్భంగా ఘంటసాల చైతన్య వేదిక, సీనియర్ సిటీజన్స్, జెవివి సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో పట్టణంలోని ఘంటసాల విగ్రహం వద్ద జయంతి మాసోత్సవాలు శుక్రవారం ప్రారంభించారు. కోట వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ సాధారణ కుటుంబంలో పుట్టి సంగీత ప్రపంచంలో ఉన్నత స్థాయికి ఎదిగిన మహనీయుడు ఘంటసాల అని అన్నారు. మూడు దశాబ్దాల పాటు ఆరు భాషల్లో పదివేల పాటలు పాడారని అన్నారు. దేశభక్తి గీతాలూ ఆలపరించారని అన్నారు. కార్యక్రమంలో మొహమ్మద్ సాదిక్, జాలా రామిరెడ్డి, బుర్ర వలిబాబు, నిర్మలమ్మ, మనోహర లోహియా, దాసరి లక్ష్మీ, లింకన్, పోలిరెడ్డి, రేణుక, సూరిబాబు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి చింతల శ్రీకృష్ణయ్య

గృహనిర్మాణంపై స్పెషల్ డ్రైవ్

ప్రజాశక్తి - నగరం

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంపై శుక్రవారం సమీక్ష నిర్వహించారు. గృహనిర్మాణ శాఖ సిబ్బంది, సచివాల ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు శిక్షణలో ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య మాట్లాడుతూ డిసెంబర్ 1నుంచి స్పెషల్ మెగా డ్రైవ్ నిర్వహించాలని సూచించారు. హౌసింగ్ డిఇ మాట్లాడుతూ మండలంలో ఇప్పటికీ 618ఇల్లు మంజూరైనట్లు తెలిపారు. వాటిలో 100ఇల్లు వివిధ దశల్లో ఉన్నట్లు తెలిపారు. ప్రత్యేక అధికారి సైదా నాయక్, తహశీల్దారు ప్రమీల, హౌసింగ్ డిఇ సుబ్బారావు, ఎంపీడీఒ చక్రపాణి ప్రసాద్ పాల్గొన్నారు.



జడ్జి ఎం సుధారాణిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ వేణుగోపాల్

మహిళా హక్కులపై గెస్ట్ లెక్చర్

ప్రజాశక్తి - వేటపాలెం

సామరస్య న్యాయం – మహిళా హక్కుల పరిరక్షణపై గెస్ట్ లెక్చర్ నిర్వహించినట్లు సెయింట్ ఆన్స్ కళాశాల అడ్మిని స్ట్రేటివ్ మేనేజర్ ఆర్‌వి రమణమూర్తి శుక్రవారం తెలిపారు. విద్యార్థునులు నేటి ఆధునిక సమాజంలో సమస్యలను, సవాళ్లను ఎదుర్కోటానికి సూచనలు, సలహాలు అందజేస్తు అవగాహనా కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. మండల న్యాయ సేవా అధికార సంస్థ సహకారంతో నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ ఎం వేణు గోపాల రావు తెలిపారు. సదస్సులో సివిల్ జడ్జి ఎం సుధారాణి హాజరై విద్యార్థులకు మహిళా హక్కులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ఇంటర్నల్ కంప్లయింట్ కమిటి కన్వీనర్ ఆర్ఎన్‌డి ధనలక్ష్మి పాల్గొన్నారు.

3న సామాజిక తనిఖీ ప్రజావేదిక

ప్రజాశక్తి- సంతమాగులూరు

ఈనెల 3న ఆదివారం ఎన్ఆర్ఇజిఎస్ కార్యాలయం ఆవరణలో ఉపాధి హామీ పథకంపై సామాజిక తనిఖీ ప్రజావేదిక జరుగుతుందని ఎపిఒ బాలకృష్ణ నాయక్ తెలిపారు. 20పంచాయతీలలో 2022 ఏప్రిల్ నుండి 2023 మార్చి వరకు జరిగిన పనులపై గత అక్టోబర్ 14నుండి నవంబర్ 30వరకు గ్రామాల్లో సామాజిక తనిఖీ బృందం తనిఖీ నిర్వహించినట్లు తెలిపారు. ఈ అంశాలపై ఆదివారం ప్రజా వేదిక ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి సర్పంచులు, ప్రజా ప్రతినిధులు కోరారు.

ఎయిడ్స్ రోగుల పట్ల వివక్ష వద్దు

ప్రజాశక్తి - పంగులూరు

ఎయిడ్స్ రోగులపట్ల వివక్ష చూప కుండా వారిలో మానసిక మనోధైర్యాన్ని నింపాలని పిహెచ్‌సి డాక్టర్ శివ చెన్నయ్య, డాక్టర్ బాల రాజేశ్వరి దేవి సూచించారు. మండలంలోని కొండమూరులో వైద్య ఆరోగ్య సిబ్బంది శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ శివ చెన్నయ్య, సూపర్వైజర్లు మదర్సా, హరిబాబు, రమాదేవి, ల్యాబ్ టెక్నీషియన్ హరిచందన, ఫార్మసిస్ట్ పద్మావతి, స్టాఫ్ నర్స్ శివనాగేశ్వరరావు, ఏఎన్ఎంలు రాధ, ఎస్తేరు, శివకోటేశ్వరి, సిహెచ్ఓ ఏసోబు, పావని, ఆరోగ్య కార్యకర్తలు జాషువా, సతీష్ పాల్గొన్నారు.

ఇంకొల్లు రూరల్ : మండలంలోని ఇడుపులపాడు విద్యా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రపంచ హెచ్ఐవి, ఎయిడ్స్ అవగాహన దినోత్సవం శుక్రవారం నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం పిడపర్తి పేరిరెడ్డి అధ్యక్షత వహించారు. విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పేరిరెడ్డి, పాఠశాల సిబ్బంది పర్వతనేని పావని, పెంట్యాల పావని, బండారు అనిల్ కుమార్, అంబటి సురేష్, వసంత రఘు బాబు, వరికల్లు బ్రహ్మయ్య, గోరంట్ల సంధ్యారాణి, అంబటి అపర్ణ, కంబాలపాటి నరసయ్య పాల్గొన్నారు.

కారంచేడు : ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా స్వర్ణ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు పిహెచ్‌సి ల్యాబ్ టెక్నీషియన్ బయ్యా శంకర్ శుక్రవారం నిర్వహించారు. పోటీల్లో ప్రథమ బహుమతి తాండ్ర భవిత, ద్వితీయ బహుమతి అమ్మిశెట్టి రాజు, తృతీయ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం సుబ్బారావు, ఉపాధ్యాయులు ఎల్‌కె ప్రసాద్, కమల్ పాల్గొన్నారు.

అద్దంకి : హెచ్ఐవి, ఎయిడ్స్ భాదిత రోగులను ప్రేమించాలని, వారికి ఆత్మస్థైర్యాన్ని కలిగించాలని మున్సిపల్ చైర్మన్ ఇస్తేరమ్మ పేర్కొన్నారు. అంతర్జాతీయ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా హెల్ప్ టిఐ, ఎయిడ్స్ నియంత్రణ మండలి, వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో పట్టణంలో అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు హెల్ప్ టిఐ పిడి బివి సాగర్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ఆర్ దేవసేన కుమారి, మున్సిపల్ కమిషనర్ బి శ్రీనివాసులు, పిహెచ్‌సి డాక్టర్ ఎన్ నవ్యరెడ్డి, హెల్ప్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బివి సాగర్, ఓఆర్డబ్ల్యూ శ్రావణి, మల్లేశ్వరి, శివ పార్వతి, మున్సిపల్ మేనేజర్ బి శ్రీదేవి, మెప్మా సిఎంఎం బి ఫణికుమారి, మెడికల్ ఆఫీసర్ శ్రీనివాసరావు, ఐసిటిసి కౌన్సిలర్ జి రమేష్ బాబు, డాక్టర్ జయసింహ, డాక్టర్ మనోజ్ కుమార్, పిడి డేవిడ్ రాజు పాల్గొన్నారు.



ఐక్య క్రిస్మస్ వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న జవాన్ కుటుంబం

ప్రారంభమైన క్రిస్మస్ క్యారల్స్

ప్రజాశక్తి - చిన్నగంజాం

క్రిస్మస్ పండుగ సందర్భంగా స్థానిక అంబేద్కర్ నగర్ శుక్రవారం తెల్లవారు జామున 4గంటలకు క్రిస్మస్ క్యారల్స్ ప్రారంభించారు. విశ్రాంత సైనిక ఉద్యోగి అల్లాడి సుబ్బారావు జ్ఞాపకార్థం ఆయన కుమార్తె కుమారి, మనవడు నవీన్ సండే స్కూల్ చిన్నారులకు, యువతీ యువకులకు కేక్ కట్ చేసి పంచిపెట్టారు. మేడికొండ జయపాల్ జ్ఞాపకార్థం వారి కుమార్తె సంతోషం, కుటుంబ సభ్యులు చిన్నారులకు క్యాండిల్స్, టీ బిస్కెట్స్ అందజేశారు. కార్యక్రమంలో క్రిస్మస్ క్యారల్స్ నిర్వాహకుడు మేకల మేషక్ బాబు, జి చందుసాగర్, వాలంటీరు మార్పు మహేష్, మేడికొండ సునీల్, జి శ్వేత, మార్పు బాబి పాల్గొన్నారు.

నిధులు దుర్వినియోగంపై విచారణ

ప్రజాశక్తి - కారంచేడు

స్థానిక పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై అధికారులు శుక్రవారం విచారణ చేపట్టారు. 2019నుంచి 2023వరకు ప్రత్యేక అధికారుల కాలంలో, పాలక వర్గం ఏర్పడిన తర్వాత నిధుల దుర్వినియోగం జరిగిందని, వ్యక్తిగతంగా వాడుకున్నారని 7వ వార్డు సభ్యురాలు ఆదిలక్ష్మి కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాలతో అధికారులు విచారణ చేస్తున్నారు. గతంలో రెండేళ్ల ప్రత్యేక అధికారుల కాలంలో అప్పటి కార్యదర్శి నిధులను వివిధ రకాల పనులు చేసినట్లుగా చూసి కొంత మంది అకౌంట్లలో వేసి దుర్వినియోగం చేశారని సర్పంచ్ బాలిగ శివ పార్వతి అప్పట్లో ఆందోళన చేశసిన విషయం తెలిసిందే. అయితే తాజాగా ఫిర్యాదుపై ఇప్పటికి మూడుసార్లు అధికారులు విచారణ చేశారు. కానీ నిధుల దుర్వినియోగం తేల్చలేకపోయారు. ప్రస్తుతం చీరాల డిఎల్పిఒ దారా హనుమంతరావు ఆధ్వర్యంలో నలుగురు అధికారులు తాజాగా విచారణ చేశారు. తమ విచారణ నివేదికను కలెక్టర్‌కు అందిస్తామని, తదుపరి చర్యలు కలెక్టర్ తీసుకుంటారని చెప్పారు. విచారణలో పంచాయతీ కార్యదర్శులు మస్తాన్‌రావు, హరిప్రసాద్, దేశాయిపేట జూనియర్ అసిస్టెంట్ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

అందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి - చీరాల



వైసిపి జెండా ఆవిష్కరిస్తున్న చైర్మన్ శ్రీనివాసరావు

అర్హులైన లబ్ధిదారులు అందరికీ వైసీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు అందుతున్నాయని మునిసిపల్ చైర్మన్ శ్రీనివాసరావు అన్నారు. ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణ మూర్తి, వైసిపి ఇంచార్జీ కరణం వెంకటేష్ ఆదేశాల మేరకు 28వ వార్డు కౌన్సిలర్ కీర్తి వెంకట్రావు, 29వ వార్డు కౌన్సిలర్ బత్తుల అనిల్ అధ్యక్షతన హరిప్రసాద్ నగర్–2 సచివాలయం పరిధిలో జగనన్నే ఎందుకు కావాలంటే కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు కొండ్రు బాబ్జీ, వైస్ చైర్మన్ బొనిగల జైసన్ బాబు, వైసిపి జిల్లా కార్యదర్శి శిఖా సురేష్, సల్లూరీ అనిల్, మాజీ కౌన్సిలర్ కాగితాల ప్రకాష్, మల్లెల లలితరాజశేఖర్, కంపా అరుణ్, తోకల అనిల్, కలవకూరి యానాదిరావు, పొత్తూరి సుబయ్యా, కో ఆప్షన్ షేక్ కబీర్, షేక్ సుభానీ, అన్నం సతీష్, డొక్కా ప్రవీణ్, యాతం మేరీబాబు, శ్రీనివాసరెడ్డి, తలకాయల సుధీర్, బుజ్జి పాల్గొన్నారు.

రేపల్లె : ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు కావాలి కార్యక్రమాన్ని పిరట్లంక గ్రామంలో వైసిపి రూరల్ కన్వీనర్ గాదె వెంకయ్య బాబు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ అమలు చేశారని అన్నారు. పథకాలు కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లో తిరిగి జగన్‌ను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఇఓపిఆర్డి, సర్పంచుల ఫోరం అధ్యక్షులు మండలి అంజయ్య, వైసిపి గ్రామ ఇంచార్జ్ పిరాట్లంక రాంబాబు, జడ్పిటిసి బొర్రా లక్ష్మిశ్రీనివాసరావు, కో ఆప్షన్ నెంబర్ ఫరీద్, పంచాయితీ సెక్రెటరీ గాదె విజయ్, మణి బాబు, ధూళిపాల పుల్లారావు, చెన్నుపల్లివారిపాలెం వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి - రేపల్లె

ఓటు రాజ్యాంగం కల్పించిన హక్కు అని, 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని తహశీల్దారు డి మల్లికార్జునరావు కోరారు. నీ ఓటు, నీ భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా తహశీల్దారు కార్యాలయం నుంచి చేపట్టిన ఓటరు నమోదు అవగాహన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ర్యాలీలో ఏపీఆర్ కాలేజ్ విద్యార్థులు ఓటరు నమోదుపై నినాదాలు చేశారు. దేశ భవిష్యత్తును నడిపించేది యువతేనని అన్నారు. యువత ఓటరుగా నమోదు చేసుకొని ప్రజాస్వామ్య వ్యవస్థలో భాగస్వాములు కావాలని అన్నారు. డిసెంబర్ 2,3 తేదీల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో 2024 జనవరి 1 నాటికి 18ఏళ్లు పూర్తికానున్న వాళ్లు ఓటరుగా నమోదు కావాలని కోరారు. మండలంలో 18ఏళ్లు నిండి ఓటరు జాబితాలో పేరు నమోదు లేకుండా ఏ ఒక్కరు లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని అన్నారు. ఓటరుగా ఆన్‌లైన్ ద్వారా, ఆఫ్‌లైన్ విధానంలోనూ నమోదు చేసుకోవచ్చని తెలిపారు. నేషనల్ ఓటర్ సర్వీస్ పోర్టల్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో కూడా ఓటరుగా నమోదు చేసుకోవచ్చని సూచించారు. అవసరమైన పత్రాలతో పోలింగ్ స్టేషన్‌కు వెళ్లి తప్పనిసరిగా తమ పేరును ఓటర్ల జాబితాలో చేర్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి విజయసారథి, సిఐ నజీర్ బేగ్, ఎస్ఐ హరిబాబు పాల్గొన్నారు.

నగరం : మండలంలోని అన్నీ పోలింగ్ కేంద్రాల వద్ద ఓటరు నమోదుపై ఈనెల 2, 3తేదీల్లో స్పెషల్ క్యాంపెయిన్ నిర్వహించనున్నట్లు తహశీల్దారు ఎం ప్రమీల తెలిపారు. ప్రతీ ఒక్క ఓటరు తమ ఓటు వివరాలు బిఎల్‌ఓల వద్ద సరిచూసుకోవాలని చెప్పారు. చేర్పులు, మార్పులు ఉంటే ఈ 2రోజుల్లో సరిచేసుకొనే అవకాశం ఉన్నట్లు తెలిపారు. ఓటు హక్కు వినియోగంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో డిప్యూటీ తహశీల్దారు ఎం శ్రీనివాసరావు, కళాశాల ప్రిన్సిపాల్ హరికృష్ణ పాల్గొన్నారు.

చెరుకుపల్లి : ఈనెల 2, 3తేదీల్లో ఓటర్ల జాబితా సవరణలకు అవకాశం కల్పిస్తున్నట్లు తహశీల్దారు బి వెంకటేశ్వర్లు తెలిపారు. ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు పోలింగ్ బూతుల వద్ద బూత్ లెవల్ అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. అవసరమైన ఓటర్లందరూ దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు.

పశువులకు హెల్త్ కార్డులు

ప్రజాశక్తి - పంగులూరు



డాక్టర్ మురళీకృష్ణ

ప్రభుత్వం మనుషులకు ఆరోగ్యశ్రీ కార్డులు ఇచ్చినట్లుగానే ఇక నుండి పశువులకు కూడా హెల్త్ కార్డులు ఇస్తున్నట్లు పశు వైద్యులు డాక్టర్ మురళీకృష్ణ తెలిపారు. పశువులతో పాటు గొర్రెలు, మేకలకు కూడా ఆరోగ్య కార్డులు ఇస్తామని అన్నారు. స్థానిక పశువుల హాస్పిటల్‌లో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పశువుల చెవులకు వేసిన ట్యాగ్ నంబర్లను పశువుల హెల్త్ కార్డులులో వేసి కార్డును పశు పోషకునికి ఇస్తామని తెలిపారు. పశువును హాస్పటల్‌కు తీసుకొచ్చిన పుడు ఆకార్డు కూడా తీసుకురావాలని చెప్పారు. ఈ కార్డు ద్వారా నట్టల నివారణ, గాలికుంటు, గొంతువాపు, జబ్బ వాపు, బృసెల్లా, ఇతర వ్యాధులకు వైద్యం చేయించుకోవచ్చని చెప్పారు. గొర్రెలు, మేకలకు కూడా ఈ కార్డు ద్వారా వైద్యం చేయించుకోవచ్చని చెప్పారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఆడ దూడలే పుట్టటానికి ఎస్ఎస్ఎస్ ఎద ఇంజక్షన్లను గేదెలకు వేస్తున్నామని చెప్పారు. ఈ ఇంజక్షన్లు గేదెలకు వేస్తే ఆడదూడలె పుడతాయని చెప్పారు. నాలుగు నెలల నుండి 8నెలల్లో లోపు ఆడదూడలకు గర్భకోశ వ్యాధులు రాకుండా బ్రూసెల్లా టీకాలు వేస్తున్నామని తెలిపారు. ఆడ దూడలున్న యజమానులు తమ దూడలకు ఈ టీకా వేయించుకోవాలని సూచించారు. వర్షాలు కురుస్తూ, మంచు కురుస్తూ ఉండటం వలన ఈ సీజన్లో ఎక్కువగా పారుడు వ్యాధి వస్తుందని తెలిపారు. ఈ వ్యాధి నివారణకు ఇంజక్షన్ చేయించుకోవాలని చెప్పారు. నేషనల్ ఐస్టాక్ మిషన్ ద్వారా ప్రభుత్వం గొర్రెలు, పందులు, కోళ్లకు సంబంధించి 50శాతం సబ్సిడీతో రుణాలు మంజూరు చేస్తుందని అన్నారు. రూ.10లక్షల నుండి రూ.కోటి వరకు రుణాలు పొందవచ్చని తెలిపారు. గొర్రెలు, పందులు, కోళ్ల పెంపకం మీద ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

మైనార్టీలకు ద్రోహం చేసిన వైసీపీ



టిడిపిలో చేరిన వైసిపి మద్దతుదారులైన ముస్లింలు

ప్రజాశక్తి - కర్లపాలెం

వైసిపీ ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత ముస్లిం, మైనార్టీలకు ద్రోహం చేసిందని టిడిపి ఇంచార్జ్ వేగేశన నరేంద్ర వర్మ ఆరోపించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో పెరలి గ్రామానికి చెందిన 29మంది వైసిపి నాయకులు, కార్యకర్తలు వైసీపీపై ఆసహనంతో టిడిపి విధానాలు నచ్చి నరేంద్రవర్మ, టిడిపి, జనసేన నాయకుల సమక్షంలో టిడిపి కండువా కప్పుకున్నారు. పేరలి గ్రామానికి చెందిన ముస్లిం, మైనారిటీలు టిడిపిలో చేరడం శుభ పరిణామ మని అన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ ఏపూరి భూపతిరావు, పార్లమెంటు ఉపాధ్యక్షులు నక్కల వెంకటస్వామి, మాజీ ఎంపిటిసి షేక్ బాజీ పాల్గొన్నారు.

చీరాల : టిడిపితోనే రాష్ట్ర అభివృద్ధి జరుగుతుందని, అర్హులైన లబ్ధిదారులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని టిడిపి ఇన్చార్జి ఎం ఎం కొండయ్య అన్నారు. బాబు షఉరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం 1వ వార్డులో శుక్రవారం నిర్వహించారు. ఇంటికి వెళ్లి టిడిపి అమలు చేయబోయే పథకాల వివరాలతో కూడిన కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో యువ నాయకులు ఎం గౌరీ అమర్నాథ్, అనపర్తి వనజ, అనపర్తి రత్నబాబు, ఉసురుపాటి సురేష్, గంజి పురుషోత్తం, నరాల తిరుపతి రాయుడు, పావులూరి రవీంద్ర, నందం లావణ్య, పడవల లలిత, అవ్వారు శివకుమారి, కూరపాటి వరలక్ష్మి, ఆకురాతి సుజాత పాల్గొన్నారు.

బాపట్ల : ఆర్థికంగా నిరుపేదలు ఎదగాలన్నదే టిడిపి లక్ష్యమని టిడిపి ఇంచార్జ్ వేగేశన నరేంద్ర వర్మ అన్నారు. పట్టణంలో 8వవార్డు మల్లికార్జున బృందావనంలో ప్రతి ఇంటికి టిడిపి కార్యక్రమం నిర్వహించారు. నిజాయితీగా ప్రజాసేవ చేసేందుకు తాను రాజకీయాల్లోకి వచ్చానని అన్నారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ నాయకులు గొలపల శ్రీనివాసరావు, ఫరీద్ మస్తాన్, కొల్లూరి వెంకట్రావు, నక్కల వెంకటస్వామి, తిరుమలశెట్టి శ్రీనివాసరావు, ధార అశోక్, హనుమాన్ జి, దమ్మాలపాటి రాఘవేంద్రరావు, వీరాంజనేయులు, సంజయ్ గాంధీ, వెంకటేష్, ఏసోబు, కిరణ్, దుర్గారావు, వెంకటేష్, సాంబయ్య, మర్రిపల్లి నాగరాజు, రుక్మిణి పాల్గొన్నారు.

పంగులూరు : టిడిపితోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మండలంలోని బూదవాడ గ్రామంలో బాబు షఉరిటీ, భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి మహిళలు, యువతతో మాట్లాడారు. సమస్యలు తెలుసుకున్నారు. టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేయబోయే సంక్షేమ పథకాలు మహాశక్తి, యువగళం, అన్నదాత, ఇంటింటికీ నీరు, పూర్ టు రిచ్, బీసీ రక్షణ చట్టం గురించి వివరించారు. జగన్ రెడ్డిలా అప్పులతో కాకుండా పరిశ్రమలు స్థాపించి సంక్షేమం, అభివృద్ధి రెండు చంద్రబాబు ముందుకు తీసుకు వెళ్తారని చెప్పారు. కార్యక్రమంలో మాజీ డైరీ ఛైర్మన్ బాలిన రామసుబ్బారావు, మాజీ జెడ్‌పిటిసి కరి వెంకటసుబ్బారావు, టిడిపి నాయకులు కుక్కపల్లి ఏడుకొండలు, గుర్రం ఆదిశేకర్, గొట్టిపాటి కాజా స్వామి, చింతల సహదేవుడు, కొమ్మారెడ్డి శ్రీనివాసరెడ్డి, వలపర్ల సుబ్బారావు, దశరథ, ఆరికట్లవారిపాలెం మాజీ సర్పంచ్ ఉన్నం రవి, పిచ్చిరెడ్డి, గుదిబండ్ల ఆదిరెడ్డి పాల్గొన్నారు.

భట్టిప్రోలు : మండలంలోని ఐలవరం గ్రామంలో టిడిపి ఆధ్వర్యంలో బాబు షఉటి, భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. బాబు షఉరిటీ పత్రాలపై నమోదు చేయించారు. రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమవుతుందని అన్నారు. రానున్న ఎన్నికల్లో టిడిపిని గెలిపించాలని కోరారు. చంద్రబాబు ప్రకటించిన మినీ మేనిఫెస్టో ప్రకారం అధికారంలోకి రాగానే అన్ని అంశాలు అమలు చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కోమనపల్లి కోటేశ్వరరావు, మాచర్ల నాగరాజు, దీపాల ప్రసాద్, అనగాని ఏడుకొండలు, జగ్గారపు పాపారావు పాల్గొన్నారు.



టిడిపి కరపత్రాలు అందజేస్తున్న ఎంఎల్ఏ గొట్టిపాటి రవి

చిన్న క్లబ్బుల అభివృద్ధికి కృషి చేస్తా

ప్రజాశక్తి - పంగులూరు

చిన్న క్లబ్‌లలో మంచి కార్యక్రమాలు జరుగుతాయని, అలాంటి క్లబ్బులను అభివృద్ధి చేయడం ద్వారా సమాజానికి ఎంతో ఉపయోగపడినవారు అవుతామని రోటరీ గవర్నర్ బూసిరెడ్డి శంకరరెడ్డి అన్నారు. హైదరాబాదు లాంటి పెద్ద పెద్ద క్లబ్బుల్లో వీక్లీ మీటింగ్లు జరగవని అన్నారు. స్థానిక రోటరీ భవనంలో క్లబ్ రోటరీ సభ్యులతో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. క్లబ్ పరిధిలో ఏదైనా ప్రైవేట్ హాస్పిటల్లో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేయడం, పార్కు ఏర్పాటు చేయటం, వ్యాయామశాలల్ని ఏర్పాటు చేయటం వంటి కార్యక్రమాలు చేయాలని కోరారు. ప్రాజెక్టు మంచిదైతే క్లబ్బు నుంచి డబ్బులు పెట్టకుండానే ఇంటర్నేషనల్ స్పాన్సర్ని చూసే అవకాశం ఉందని అన్నారు. అలాంటి వాటిని ఎంపిక చేసుకుని క్లబ్ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. మంచి ప్రాజెక్టులను గుర్తించాలని కోరారు. అసిస్టెంట్ గవర్నర్ ఇంటూరి ఆంజనేయులు మాట్లాడుతూ పంగులూరు రోటరీ క్లబ్ మిగతా క్లబ్బులకు ఆదర్శమని అన్నారు. స్థానిక హేమలింగేశ్వర స్వామి దేవాలయాన్ని దర్శనం చేసుకున్న అనంతరం పాలకేంద్రం భవన్లోని మినరల్ వాటర్ ప్లాంట్‌ను, భూసార పరీక్షలు కేంద్రాన్ని పరిశీలించారు. రోటరీ భవన్‌కు నిర్మించిన ప్రహరీ గోడను ప్రారంభించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షులు కరణం హనుమంతరావు, డిస్ట్రిక్ట్ ఛైర్మన్ చిలుకూరు వీరరాఘవయ్య, కోశాధికారి గుర్రం ఆంజనేయులు, రొటీరియర్లు పెంట్యాల జగదీశ్వరరావు, తాటిచిన సుబ్బారావు, ఎనికపాటి శ్రీనివాసరావు, గరిమిడి జగన్మోహన్రావు, రాయిని రామారావు, బత్తుల వీర నారాయణ, రాయిని వెంకట సుబ్బారావు, ఇ మ్మడిశెట్టి సుబ్బారావు, గుడిపూడి రామారావు, నాగేశ్వరరావు, సీతారామయ్య, జాగర్లమూడి సుబ్బారావు, రామాంజనేయులు పాల్గొన్నారు.

కల్యాణ మండపం ప్రారంభం

ప్రజాశక్తి - బేస్తవారిపేట

పట్టణంలోని చిన్న కంభంకు వెళ్లే రోడ్డులోని జ్ఞాన ప్రసూనాంబ సమేత కాశీ చంద్రమౌళీశ్వర స్వామి దేవాలయం నందు నూతనంగా నిర్మించిన కళ్యాణ మండపంను గిద్దలూరు టిడిపి ఇన్చార్జి ముత్తుముల అశోక్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. కళ్యాణ మండపం నిర్మాణదాత సన్నిధి శ్రీనివాసులు, విజయలక్ష్మి దంపతుల ఆహ్వానం మేరకు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ముత్తుముల అశోక్‌రెడ్డిని, పలువురు టిడిపి నాయకులను మండప నిర్మాణ దాత సన్నిధి శ్రీనివాసులు సన్మానించారు. కార్యక్రమంలో కళ్యాణ మండపం నిర్మాణ కమిటీ సభ్యులు, టిడిపి మండల అధ్యక్షుడు సోరెడ్డి మోహన్, నాయకులు పూనూరు భూపాల్‌రెడ్డి, సందు రమేష్, దూదేకుల సైదులు, పూనూరు జగన్మోహన్‌రెడ్డి, టౌన్ కన్వీనర్ రామయ్య, కళ్యాణ మండపం కమిటీ సభ్యులు దూదేకుల సిద్దయ్య, పట్టా శివకుమార్, రిటైర్డ్ ఎంఈఓ చెక్క మాధవ్ కష్ణ పాల్గొన్నారు.

భూమి హక్కు చట్టం రద్దు చేయాలి

ప్రజాశక్తి - బాపట్ల



అధ్యక్షులు లీలాకృష్ణ

రాష్ట్ర ప్రభుత్వం హడాహుడిగా ప్రవేశపెట్టిన ఆంధ్రప్రదేశ్ భూమి హక్కు చట్టం 27/2023తక్షణమే రద్దు చేయాలని కోరుతూ బార్ అసోసియేషన్ సభ్యులు శుక్రవారం విధులు బహిష్కరించారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు లీలా కృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం అమలులోకి తీసుకురానున్న చట్టం ప్రకారం స్థిరాస్తి హక్కుల కోసం రెవిన్యూ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించవలసి వస్తోందని అన్నారు. మండల స్థాయిలో టైటిలింగ్ అధికారి నమోదు చేసిన భూహక్కులపై జిల్లా స్థాయి రెవిన్యూ ట్రిబ్యునల్‌లో అప్పీల్ చేయాల్సి వస్తోందని అన్నారు. రెండేళ్ళ లోపు ఈ వివాదాలపై అభ్యంతరం తెలపాలని అన్నారు. దీంతో నిరక్షరాస్యులైన గ్రామీణ ప్రాంత ప్రజలు ఎక్కువగా నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ ఈ చట్టం అమలుల్లో లేదని అన్నారు. ప్రజల్లో ఈ చట్టంపై అవగాహన కల్పించేందుకు నేటి నుండి వారం రోజుల కార్యాచరణ ప్రణాళిక చేపడుతున్నట్లు తెలిపారు. ఈ చట్టంపై హైకోర్టులో రిట్ పిటీషన్ దాఖలు చేయాలని బాపట్ల బార్ అసోసియేషన్ ఏకగ్రీవంగా తీర్మానించినట్లు తెలిపారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

గంగవరం విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

గుంటూరు జిల్లా వడ్డేశ్వరం కెఎల్ యూనివర్సిటిలో నవంబరు 29, 30 తేదీల్లో నిర్వహించిన జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ ప్రాజెక్టుల ప్రదర్శనలో మండలంలోని గంగవరం శ్రీ వలేటి కృష్ణయ్య ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. రాష్ట్రం నుండి 26 ఉత్తమ ప్రాజెక్టులుగా ఎంపిక చేయగా విద్యార్థులు పెద్దపల్లి అంకిత, కట్టా సాహితీ ప్రదర్శించిన బుల్లేట్ మిల్లేట్స్ ప్రాజెక్టు కెవిఆర్ సైంటిఫిక్ సొసైటికి ఎంపికైంది. ప్రాజెక్టు రూపకల్పనలో గైడ్‌గా వ్యవహరించిన మేడికొండ సుమలతను పాఠశాల కరస్పాండెంట్ ఎం శ్రీనివాసరావు, హెచ్‌ఎం కె వీరాంజనేయులు అభినందించారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - భట్టిప్రోలు



ఎఓ గొల్లపోతు వీరయ్య

నేటి నుండి 5వరకు బంగాళా ఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో అధిక వర్షాలు కువరనున్న దృష్ట్యా రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ అధికారి గొల్లపోతు మీరయ్య, వేమూరు ఎఓ సిహెచ్ సునీత సూచించారు. ఖరీఫ్ సీజన్లో రైతులు సాగు చేసిన వరి పంటను కాపాడుకునేందుకు వరి పనలు, కంకులపై పునీటి ద్రావణాన్ని పిచికారి చేయాలని అన్నారు. హార్వెస్టల ద్వారా కోత కోసిన రైతులు ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు చేర్చుకోవాలని అన్నారు. ఈనెల 2నుండి 4వరకు వర్షాలు కురుస్తాయని వాతావరణ హెచ్చరికల దృష్ట్యా రైతులు తగిన జాగ్రత్తలు వహించాలని అన్నారు. రబీ సీజన్లో పంటలకు సాగునీరు అందే పరిస్థితి లేకపోవడంతో రైతులు గమనించి బోరు వసతి లేని ప్రాంతాల్లో మినుము, పెసర సాగు చేసేందుకు సిద్ధపడాలని సూచించారు. జొన్న, మొక్కజొన్న సాగు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

ఎయిడ్స్ బాధితులకు అండగా ఉంటా..

- అవగాహన ర్యాలీని ప్రారంభించిన కలెక్టర్ దినేష్‌కుమార్, ఎంపీ మాగుంట

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఎయిడ్స్ బాధితులు, వారి కుటుంబ సభ్యులకు ప్రభుత్వ పరంగా, వ్యక్తిగతంగా తాను కూడా అండగా ఉంటానని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ తెలిపారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా శుక్రవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో ఎయిడ్స్ బాధితులు, వివిధ పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన ప్రత్యేక అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. తొలుత కలెక్టరేట్ నుంచి జిజిహెచ్ వరకు నిర్వహించిన అవగాహనా ర్యాలీని ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులు రెడ్డితో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ బాధితుల వివరాలను స్వచ్ఛంద సంస్థలు తన దష్టికి తీసుకువస్తే వారికి అవసరమైన సహాయం వ్యక్తిగతంగా తాను కూడా చేస్తానన్నారు. అనంతరం బాధితులతో కలిసి జిల్లా కలెక్టర్ భోజనం చేశారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె. శ్యాంబాబు, డిఎంహెచ్ఒ డాక్టర్ ఎస్. రాజ్యలక్ష్మి, జిల్లా క్షయ, ఎయిడ్స్ నివారణ అధికారి డాక్టర్ సురేష్ కుమార్, డిఐఒ పద్మజ, జిల్లా మలేరియా అధికారి జ్ఞానశ్రీ, డిపిఎం వాణిశ్రీ, టిబి డిపిసి రత్నకుమారి, అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ ప్రభాకర్ పాల్గొన్నారు.

బాపట్లలో ర్యాలీ

బాపట్ల: ఎయిడ్స్ వ్యాధిని సమూలంగా నిర్మూలించేందుకు వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టాలని బాపట్ల జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా సూచించారు. శుక్రవారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం నిర్వహించిన ఎయిడ్స్ నియంత్రణ అవగాన ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి ఎస్.విజయమ్మ, జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టిబి కంట్రోల్ అధికారి సి.వి.రమాదేవి, వివిధ విభాగాల వైద్యాధికారులు సయ్యద్ జానీభాషా, షేక్ సాధిక్, జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ కార్యదర్శి బిఎస్ నారాయణబట్టు పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎంపీ



బాపట్లలో ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్

జిల్లా అభివృద్ధికి పాటుపడ్డ 'సుబ్బరామన్న'

- సంస్మరణ సభలో పాల్గొన్న ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు

- నివాళులర్పించిన కలెక్టర్ దినేష్ కుమార్, ఎస్‌పి మలికాగర్గ్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లా అభివృద్ధికి దివంగత మాగుంట సుబ్బరామరెడ్డి చేసిన సేవలు మరువలేనివని, సుబ్బరామరెడ్డి ఒంగోలు పార్లమెంట్‌కు పోటీ చేసి గెలిచి ప్రకాశం జిల్లా అభివృద్ధికి పాటుపడ్డారని పలువురు ఎమ్మెల్యేలు, అధికారులు పేర్కొన్నారు. మాగుంట సుబ్బరామరెడ్డి ఆశయ సాధనకు కృషి చేస్తున్న ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులు రెడ్డి సేవలను వారు కొనియాడారు. ఒంగోలు మాజీ పార్లమెంట్ సభ్యులు మాగుంట సుబ్బరామరెడ్డి 28వ వర్థంతి సందర్భంగా శుక్రవారం ఒంగోలు పివిఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో సంస్మరణ సభ, ఉచిత వైద్య శిబిరం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. తొలుత రాంనగర్ 2వ లైన్‌లోని ఎంపీ మాగుంట కార్యాలయంలో సుబ్బరామరెడ్డి చిత్రపటానికి ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, యువ నాయకులు మాగుంట రాఘవరెడ్డి, కుటుంబ సభ్యులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఒంగోలు నగరంలోని హొటల్ అభిలాష్ వద్ద ఉన్న మాగుంట సుబ్బరామరెడ్డి విగ్రహానికి, ఎస్‌బిఐ బ్యాంకు వద్ద ఉన్న సుబ్బరామన్న విగ్రహానికి, అద్దంకి బస్టాండ్ వద్ద ఉన్న సుబ్బరామరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఒంగోలు పివిఆర్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో సంస్మరణ సభ జరిగింది. తరువాత సర్వమత ప్రార్ధనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి, శచీదేవి దంపతులు పూజ నిర్వహించి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఒంగోలు ఎమ్మెల్యే మాట్లాడుతూ 1999 నుంచి ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, తన కాంబినేషన్ విజయం సాధిస్తోందన్నారు. యువ నాయకులు మాగుంట రాఘవరెడ్డిని ఆశీర్వదించాలని, ప్రకాశం జిల్లా అభివృద్ధికి మాగుంట కుటుంబం కృషి చేయాలని కోరారు. కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్, ఎస్‌పి మలికా గర్గ్, ఒంగోలు మేయర్ గంగాడ సుజాత మాట్లాడారు. కార్యక్రమంలో సంతనూతలపాడు ఎమ్మెల్యే టిజెఆర్ సుధాకర్ బాబు, వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తుల బ్రహ్మానంద రెడ్డి, దర్శి మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివ ప్రసాద్ రెడ్డి పిడిసిసి బ్యాంకు ఛైర్మన్ వైఎం ప్రసాద్ రెడ్డి, మాజీ ఛైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య, వైసిపి జిల్లా అధ్యక్షులు జంకె వెంకట రెడ్డి ప్రసంగించారు. ఈ సందర్భంగా మాగుంట కళాశాలల్లో చదువుతూ ఉత్తమ ఫలితాలు అందుకున్న విద్యార్థులను బంగారు పతకాలతో సత్కరించారు. అనంతరం భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.



సుబ్బరామన్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బాలినేని



అన్నదానంలో వడ్డిస్తున్న కలెక్టర్

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

మాగుంట సుబ్బరామరెడ్డి వర్థంతి సందర్భంగా నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. సుమారు 375 మందిని వైద్యులు పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ ఎల్.జాన్ రిచర్డ్, డాక్టర్ అమర్‌నాథ్ రెడ్డి, డాక్టర్ నితిన్ నల్లూరి, డాక్టర్ రమణారెడ్డి, డాక్టర్ కళ్యాణ్, డాక్టర్ ప్రశాంతి, డాక్టర్ కళ్యాణ్, డాక్టర్ నిశ్చల్ రెడ్డి వైద్యసేవలు అందించారు.

ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించడానికి

అధికారులు సన్నద్ధం కావాలి

కలెక్టర్ రంజిత్‌బాషా

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జిల్లాలో జరగనున్న సాధారణ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించడానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక బాపట్ల ఏ.జి. కాలేజీ ఆడిటోరియంలో సెక్టార్ ఆఫీసర్లు మరియు సెక్టార్ పోలీసు ఆఫీసర్లకు ఎన్నికల నిర్వహణపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకే జిల్లాలో సెక్టార్ ఆఫీసర్లు మరియు సెక్టార్ పోలీసు ఆఫీసర్లను నియమించడం జరిగిందన్నారు. సెక్టార్ ఆఫీసర్లు మరియు సెక్టార్ పోలీస్ ఆఫీసర్లకు ఇచ్చిన హ్యాండ్ బుక్స్‌ను పూర్తిగా చదవాలన్నారు. 10 నుంచి 12 పోలింగ్ కేంద్రాలకు ఒక సెక్టార్ ఆఫీసర్, ఒక సెక్టార్ పోలీస్ ఆఫీసర్‌ను నియమించడం జరిగిందని చెప్పారు. సెక్టార్ ఆఫీసర్లు మరియు సెక్టార్ పోలిస్ ఆఫీసర్లు పోలింగ్ కేంద్రాలను తప్పనిసరిగా తనిఖీలు చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని చెప్పారు. జిల్లాలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించాలన్నారు. కార్యక్రమంలో అదనపు జిల్లా ఎస్.పి మహేష్, జిల్లా రెవెన్యూ అధికారి పి.వెంకటరమణ, ఇ.ఆర్.ఓలు రవీంద్ర, సరోజిని, తహశీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ఇంటి పన్ను చెల్లించలేదని..

పింఛన్ నిలిపేశారు.!

నిరసనతో దిగొచ్చిన అధికారులు

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

ఇంటి పన్ను చెల్లిస్తేనే పింఛన్ డబ్బులిస్తామని మండలంలోని ఈదుమూడి గ్రామ పంచాయతీ కార్యదర్శి బెనహర్ ఆదేశాలు జారీ చేయడంతో వాలంటీర్లు లబ్ధిదారులకు శుక్రవారం పింఛన్ డబ్బులివ్వలేదు. దీంతో లబ్ధిదారులు పంచాయతీ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. పంచాయతీలో మొత్తం 500 మంది పింఛన్ లబ్ధిదారులు ఉన్నారు. వీరిలో ఎక్కువమంది ఇంటి పన్ను కట్టడం లేదనే కారణంతో కార్యదర్శి పింఛన్ డబ్బులివ్వవద్దని వాలంటీర్లకు ఆదేశాలిచ్చారు. దీంతో ఒకటో తేదీ అయిన శుక్రవారం వాలంటీర్లు పింఛన్ పంపిణీ చేయలేదు. విషయం తెలుసుకున్న వృద్ధులు పంచాయతీ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. దీంతో అధికారులు దిగొచ్చి.. పింఛన్ డబ్బులను లబ్ధిదారులకు అందజేశారు. కార్యదర్శిని వివరణ కోరగా పన్ను కట్టుకోవాలని మాత్రమే చెప్పామన్నారు.

మాది రైతు పక్షపాత ప్రభుత్వం

మంత్రి సురేష్

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

రైతే రాజుగా.. వ్యవసాయం అంటే పండుగలా చేస్తూ జగనన్న ప్రభుత్వం రైతు పక్షపాత ప్రభుత్వంగా పనిచేస్తుందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. శుక్రవారం యర్రగొండపాలెంలోని అంబేద్కర్ ఆడిటోరియంలో నియోజకవర్గ వ్యాప్తంగా 103 మంది భూమి లేని నిరుపేద లబ్ధిదారులకు 138 ఎకరాల అసైన్‌మెంట్ భూములను, అలాగే 629 మంది లబ్ధిదారులకు 1263 ఎకరాల అసైన్‌మెంట్ భూములకు యాజమాన్య హక్కు ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశారు. రూ.50 లక్షల విలువైన 274 తైవాన్ స్ప్రేయర్లు, 148 పవర్ ట్రిల్లర్లను గిరిజన సంక్షేమ శాఖ, ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో గిరిజన రైతులకు పంపిణీ చేశారు. ఈ సంధర్భంగా జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ 20 సంవత్సరాలకు పైగా అసైన్‌మెంట్ భూములు కలిగిన రైతులకు వాటికి పూర్తి యాజమాన్య హక్కులు కల్పించి క్రయ, విక్రయాలు చేసుకునేలా ప్రభుత్వం అధికారాన్ని కలిగించడంతో రైతులకు ఎంతో ఉపయోగం కలుగనుందని తెలిపారు. దోర్నాలలో మరొక మార్కెట్ యార్డు కమిటిని త్వరలోనే ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైసీపీ జిల్లా ఉపాధ్యక్షులు ఒంగోలు మూర్తిరెడ్డి, ఎంపిపిలు దొంతా కిరణ్ గౌడ్, కోట్ల సుబ్బారెడ్డి, కందుల వెంకటయ్య, పెద్ద గురవయ్య, జడ్పిటిసిలు చేదూరి విజయభాస్కర్, చలమయ్య, వైసీపీ మండల కన్వీనర్లు కొప్పర్తి ఓబుల్‌రెడ్డి, బివి సుబ్బారెడ్డి, గంటా వెంకట రమణారెడ్డి, సింగారెడ్డి పోలిరెడ్డి పాల్గొన్నారు.



పట్టాలు అందజేస్తున్న మంత్రి సురేష్

సుందర నగరంగా ఒంగోలు : కమిషనర్

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ఒంగోలులో నిత్యం క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా నగరాన్ని సుందర నగరంగా తీర్చిదిద్దుతామని నగరపాలక సంస్థ కమిషనర్ ఎం వెంకటేశ్వరరావు తెలిపారు. కార్పొరేషన్ సిబ్బంది శుక్రవారం రాంనగర్‌లోని డివైడర్ మధ్యలో చెత్తా, చెదారం తొలగించడం, మొక్కలను సంరక్షించే కార్యక్రమాన్ని ప్రత్యేకంగా చేపట్టారు. విఐపిరోడ్డు, కొత్త కూరగాయల మార్కెట్ వద్ద, మహిళా మార్ట్ ఏరియాలతో డ్రెయినేజీ పూడికతీత పనులు నిర్వహించారు. కార్యక్రమాలను కమిషనర్ పరిశీలించారు. కమిషనర్ వెంట డిఈఈ రఘురాం, ఏఈ ప్రసాద్, తదితరులు ఉన్నారు. అనంతరం కమిషనర్ సుజాత నగర్ సచివాలయాన్ని సందర్శించి ఆస్థిపన్ను, నీటి పన్నుల వసూళ్లమీద సచివాలయ సిబ్బందితో సమీక్షించారు.

పట్టాల పంపిణీలో ప్రోటోకాల్ వర్తించదా.?

జడ్పీటీసీ గుంటక తిరుపతిరెడ్డి

ప్రజాశక్తి-వెలిగండ్ల

ప్రభుత్వం భూమిని కొన్ని సంవత్సరాలుగా సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న గణేశునిపల్లి గ్రామానికి చెందిన దాసరి కులస్తులకు ప్రభుత్వం చేయూతనిచ్చింది. వారికి అసైన్మెంట్ కమిటీ ద్వారా హక్కు కల్పిస్తూ పట్టాలు మంజూరు చేశారు. వైసిపి నాయకులు నాగూర్‌యాదవ్, మరికొందరు ఆ పార్టీ నేతలు పాల్గొని.. పట్టాలు పంపిణీ చేశారని, మండలంలోని జడ్పిటిసి, ఎంపీపీలకు కనీస సమాచారం రెవెన్యూ అధికారులు ఇవ్వలేదని జడ్పిటిసి సభ్యులు గుంటక తిరుపతిరెడ్డి, ఎంపిపి రామన మహాలక్ష్మి అన్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

ప్రజారోగ్యానికి మొదటి ప్రాధాన్యత: కలెక్టర్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ప్రజారోగ్యం మొదటి ప్రాధాన్యత గా జిజిహెచ్‌లో చర్యలు తీసుకుంటామని, పారిశుధ్యం, సౌకర్యాల కల్పనకు తక్షణమే చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జి.జి.హెచ్‌లో ఆయన పలు విభాగాలను పరిశీలించారు. గురువారం హెచ్‌డిసి సమావేశం జరగగా మరుసటి రోజే జిజిహెచ్, వైద్య కళాశాలోని అంశాలపై ఆయన దష్టి పెట్టారు. ఉదయాన్నే మునిసిపల్, ఎపిఎంఎస్ఐడిసి, జిజిహెచ్, మెడికల్ కాలేజీ అధికారులని పిలిపించుకొని పలు విభాగాలను పరిశీలించారు. ఫార్మసీ కోసం ఇంటిగ్రేటెడ్ స్టోరేజ్ స్పేస్ కావాలన్న జిజిహెచ్ అధికారుల విజ్ఞప్తి మేరకు పాత క్యాంటీన్ భవనాన్ని ఆయన పరిశీలించారు. అందుకు సంబంధించి సమాచారం తెప్పించుకొని త్వరలో నిర్ణయం తీసుకుంటామన్నారు. అనంతరం కోవిడ్ సమయంలో నిర్మించిన టెంపరరీ హాస్పిటల్ క్యూబ్స్‌ను పరిశీలించారు. వాటిని నర్సింగ్ విద్యార్థులకి ఎలా ఉపయోగించాలి అనే అంశంపై ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలని, అందుకు అనుగుణంగా కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. డంపింగ్ యార్డుకు సంబంధించి ప్రత్యామ్నాయ స్థలాన్ని సూచించాలని ఎపిఎంఎస్ఐడిసి ఈఈ విజయ్ భాస్కర్‌ను ఆదేశించారు. కలెక్టర్ వెంట జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.భగవాన్‌నాయక్, ఆర్ఎంఓ డాక్టర్ బి.తిరుమలరావు, మున్సిపల్ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, వైద్యులు పాల్గొన్నారు.



జిజిహెచ్‌లో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్